ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

బుధవారం 30 జూలై 2025 | 5

అద్భుత ప్రయోగాల గని అంతరిక్షం

» విద్యార్థులు పరిశోధకులుగా ఎదగాలి

» అమలాపురంలో అంతరిక్ష అవగాహన శిబిరంలో ఎమ్మెల్యే ఆనందరావు 6



సదవకాశం!

లబ్ధిదారుడికి ప్రయోజనం.. ప్రభుత్వానికీ ఆదాయం



ముమ్మిడివరం అగ్రహారంలో అనధికారికంగా వెలసిన లేఅవుట్ దృశ్యాలు

- » అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ స్కీము అమలు
- » సవరణలతో కూడిన జీవోఎంఎస్ నెం.134 విడుదల
- » జిల్లావ్యాప్తంగా 650కు పైగా అనధికార లేఅవుట్లు
- » భూముల రిజిస్ట్రేషన్ విలువను బట్టి దరఖాస్తు రుసుము
- » అక్టోబరు 24తో ముగియనున్న ఎల్‌ఆర్‌ఎస్ గడువు
- » కొరడా ఝుళిపించకపోతే.. ప్రభుత్వానికి కాసులు రాలవు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వెలుస్తున్న అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం (ఎల్‌ఆర్‌ఎస్) ఇటీవల ప్రకటించింది. క్రమబద్ధీకరణ చేయించుకునే వారికి ఇదొక సదవకాశం. అటు ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతుంది. గత ఆరేళ్ల కిందట ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్ స్కీమును కొన్ని సవరణలతో చేర్పులుమార్పులు చేస్తూ ఈనెల 26వ తేదీన జీవోఎంఎస్ నంబరు 134ను విడుదల చేసింది. అయితే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు గతంలో మాదిరిగా ధరలు నిర్ణయించకుండా ఆయా ప్రాంతాల్లో ఉన్న లేఅవుట్లు వేసిన భూముల రిజిస్ట్రేషన్ విలువని బట్టి దరఖాస్తు రుసుమును చెల్లించుకునేలా నిర్ణయించారు. దీంతోపాటు కొన్ని ప్రత్యేక మార్గదర్శకాలను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనిలో భాగంగా లేఅవుట్లు వేసిన భూమికి సంబంధించి 14శాతం అభివృద్ధి పన్నుతోపాటు ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రభుత్వం నిర్ణయించిన ధరను చెల్లించాలి. ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ అయిన అనధికార లేఅవుట్‌లోని స్థలాల డాక్యుమెంట్లకు మాత్రమే ఈ స్కీము వర్తిస్తుంది. దీంతోపాటు లేఅవుట్‌ను రెగ్యులర్ చేయాలంటే 30 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాలి. లేనిపక్షంలో రోడ్డుకు ఇరువైపుల వారు చెరో ఐదు అడుగులు వదులుకుని ఖచ్చితంగా 20 అడుగుల రోడ్డు మాత్రం ఉండేలా ఆయా స్థానిక సంస్థలకు దరఖాస్తు చేస్తే తప్ప రెగ్యులరైజేషన్ కావు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అంచనాల ప్రకారం 78,452 ఎకరాల విస్తీర్ణంలో 14,535 అనధికార లేఅవుట్లను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. మన జిల్లావ్యాప్తంగా మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పాలక సంస్థతోపాటు 22 మండలాల పరిధిలో ఉన్న పంచాయతీల్లో 650కు పైగా అనధికార లేఅవుట్లు ఉన్నట్టు అధికారిక లెక్కలు వెల్లడవుతున్నాయి. ఇవన్నీ గత 2019-20 మధ్య నాటి లెక్కలుగానే తెలుస్తోంది. ఎందుకంటే మున్సిపాలిటీలోగానీ, పంచాయతీలోగానీ ఎక్కడికక్కడే అనధికార లేఅవుట్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకుని ఇష్టారాజ్యంగా అనధికార లేఅవుట్లను వేసి ప్లాట్ల విక్రయాలు మాత్రం అథరైజ్డ్‌గా చేస్తున్నారు. ఇటువంటి లేఅవుట్‌లో అనధికారిక అనుమతుల ద్వారా భారీగా భవంతుల నిర్మాణం కూడా జరిగిపోతున్నాయనడానికి జిల్లావ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో జరిగినా, జరుగుతున్న నిర్మాణాలే ఇందుకు అద్దంపడుతున్నాయి. అయితే ఎల్‌ఆర్‌ఎస్ స్కీము గతంలోను టీడీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రకటించడం ద్వారా లేఅవుట్ల క్రమబద్ధీకరణకు మరోసారి అవకాశం ఇచ్చింది. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న లేఅవుట్లు, విజిలెన్స్ విచారణలో ఉన్న లేఅవుట్లు సైతం ప్రభుత్వం నుంచి అధికారిక ధ్రువీకరణ పొందకుండానే భవనాల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్న తీరుపై విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో ఇష్టారాజ్యంగా అనధికారిక లేఅవుట్లు

జిల్లాలో ఎక్కడికక్కడే అనథరైజ్డ్ లేఅవుట్లు దర్శనమిస్తున్నాయి. తక్కువ సైట్లలో పది అడుగుల రోడ్డు కూడా లేకుండానే ప్లాట్లు విడదీసి విక్రయాలు చేస్తున్నారు. దీనికి అటు మున్సిపాలిటీ లేదా పంచాయతీ, సబ్‌రిజిస్ట్రార్, ఎలక్ట్రికల్‌శాఖ అధికారులు సైతం వాటికి అధికారిక ఆమోద ముద్రలు వేస్తూ పరోక్షంగా రియల్టర్ల అక్రమాలకు ఆజ్యం పోస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 22 మండలాల పరిధిలో ఉన్న పంచాయతీల్లో 572 అనధికారిక లేఅవుట్లు ఉన్నట్టు గుర్తించారు. అయితే వీటి సంఖ్య రెట్టింపు పైనే ఉంటుందని అంచనా. అలాగే అమలాపురం మున్సిపాలిటీలో 27 మాత్రమే అనథరైజ్డ్ లేఅవుట్లు ఉన్నట్టు మున్సిపల్ అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే వీటి సంఖ్య 70 నుంచి 80 వరకు ఉండవచ్చనేది అంచనా. ఎందుకంటే గతంలో విజిలెన్స్ విచారణ పేరుతో 25 లేఅవుట్లపై అప్పట్లో ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో వాటినే అనథరైజ్డ్‌గా మున్సిపల్ అధికారులు భావిస్తున్నట్టు ఉంది. మండపేట మున్సిపాలిటీలో అధికారికంగా 36 లేఅవుట్లు ఉండగా అనధికారికంగా 80 లేఅవుట్లు ఉన్నట్టు గుర్తించారు. రామచంద్రపురం మున్సిపాలిటీలో 10కి పైనే అనధికారిక లేఅవుట్లు ఉండవచ్చునని భావిస్తున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో 54 లేఅవుట్లు ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్ పరిధిలోకి రానున్నాయి. అయితే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు ఉత్తర్వులు జారీ అయిన 90 రోజులు వ్యవధిగా అనుమతి కోసం దరఖాస్తులు చేయాలని ఆదేశించింది. అక్టోబరు 24తో ఎల్‌ఆర్‌ఎస్ గడువు ముగిసేలా ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కోసం అనుమతిచ్చినా అక్రమలే అవుట్‌దారులపైనా ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.



పుచ్చల్లంక రేవులో విద్యార్థులకు లైఫ్‌జాకెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గిడ్డి

రాష్ట్రానికి రూ.6.75 లక్షల కోట్ల పెట్టుబడులు

వైసీపీ అసత్య ప్రచారాలతో ప్రజల్లోకి వెళ్లి అపహాస్యం పాలవుతోంది

రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్

పి.గన్నవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో రాష్ట్రానికి రూ.6.75 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. రాష్ట్రానికి వెల్లువలా వస్తున్న పెట్టుబడులు అడ్డుకునేందుకు వైసీపీ శ్రేణులతో ఏపీకి రావద్దని, ఇక్కడ భద్రత ఉండదని మెయిల్స్ పెట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సీఎం చంద్రబాబు విజనరీ ఉన్న నాయకుడని వైసీపీ ఎన్ని పన్నాగాలు పన్నినా, ఆయనపై ఉన్న నమ్మకంతో పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని మంత్రి అన్నారు. లంకల గన్నవరం డొక్కావారి తోటలో స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల ద్వారా 8 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడానికి వీలవుతుందన్నారు. ప్రస్తుతం వైసీపీ అసత్య ప్రచారాలతో ప్రజల్లోకి అపహాస్యం పాలవుతోందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నారన్నారు. అమలాపురంలో దళిత యువకుడిపై దాడి ఘటనలో తనతోపాటు తన కళాశాలను సైతం లాగేందుకు ప్రయత్నం చేస్తున్నారని మంత్రి సుభాష్ మండిపడ్డారు. బీసీ సామాజికవర్గానికి చెందిన శంకర్ అనే యువకుడు ఉద్యోగాల పేరుతో డబ్బులు లాగేసి ఆడియో సహా దొరికినా కూడా కొంత మంది వైసీసీ నాయకులు కులాల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. దళిత యువకుడిపై దాడి చేసిన వ్యక్తి తన అనుచరుడని బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది ఎవరైనా నిరూపించగలిగితే తాను దేనికైనా సిద్ధమేనని మంత్రి సవాల్ విసిరారు.

విద్యార్థులకు లైఫ్‌జాకెట్లు పంపిణీ

గోదావరి నదీపాయలో రాకపోకలు సాగించే లంకగ్రామాల విద్యార్థుల భద్రత నిమిత్తం మంత్రి వాసంశెట్టి సుభాష్ లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరావు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, ఇంచార్జ్ సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని పాల్గొన్నారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్

కోనసీమలో కొబ్బరి బోర్డు అనుబంధ సంస్థలు నెలకొల్పాలి

లోక్‌సభలో ఎంపీ హరీష్‌బాలయోగి

అమలాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక కొబ్బరి ఉత్పత్తులు ఉన్న దృష్ట్యా కొబ్బరి అభివృద్ధి బోర్డు సంస్థలను ఏర్పాటుచేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లోక్‌సభలో టీడీపీ విప్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి విజ్ఞప్తిచేశారు. కొబ్బరి రైతుల ఆదాయం పెంచడంతోపాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా లోక్‌సభాపతిని ఆయన కోరారు. జిల్లాలో కొబ్బరి జీవనోపాధిగా సాగుతున్న పంటలు, ఉత్పత్తుల నేపథ్యంలో రైతులకు మేలుచేసేందుకు కొబ్బరి ఉత్పత్తి సంస్థలను నెలకొల్పాల్సిన ప్రాధాన్యతను లోక్‌సభలో ప్రస్తావించారు. ఏపీలోనే అత్యధిక కొబ్బరి ఉత్పత్తులు సాగు జరిగే జిల్లాగా కోనసీమకు పేరుందన్నారు. కానీ రైతులు తమ ఉత్పత్తుల పూర్తి విలువను పొందడానికి స్థానికంగా అవసరమైన మద్దతు లేదన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటైన కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘాలు (సీపీఎస్), సమాఖ్యలు (సీపీఎఫ్) కంపెనీల(సీపీఎస్)తోపాటు సామూహిక మార్కెటింగ్ వ్యవసాయ సామర్థ్యం, ఉత్పత్తి విలువలను ప్రోత్సహించడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఐదేళ్లలో కేవలం సీపీఎస్‌లు మాత్రమే నమోదు చేయడం జరిగిందని, వాటిలో ఒక్కటీ పనిచేయడం లేదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొబ్బరి రైతులకు పూర్తిగా అన్యాయం జరిగిందని, కోనసీమలో కొబ్బరి రైతులను ఆదుకునేందుకు ఉత్పత్తి సంస్థలు నెలకొల్పాలని హరీష్‌బాలయోగి డిమాండ్ చేశారు.

తీరప్రాంతాల్లో విద్యుత్ లోఓల్టేజ్ సమస్య నివారించాలి

నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించాలి : కలెక్టర్ మహేష్‌కుమార్



విద్యుత్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా విషయంలో ఏపీఈపీడీసీఎల్ ఇంజనీర్లు ప్రత్యేక ఫోకస్ పెట్టి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం సేకరిస్తున్న ప్రజాసంతృప్తి స్థాయిల్లో మంచిపేరు ప్రఖ్యాతలు సాధించుకోవచ్చని కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా లోఓల్టేజ్ సమస్యలకు చెక్‌పెడుతూ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం ద్వారా రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన విద్యుత్ ఇంజనీర్ల సమావేశంలో సూచించారు. మండలాల వారీగా విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న సమస్యల పరిష్కారంపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. తీర ప్రాంత గ్రామాల్లో లోఓల్టేజ్, పవర్ కట్ వంటి సమస్యలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ ప్రాంత వాసులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వా, కమర్షియల్ రంగాలను ప్రత్యేక సెక్షన్లుగా విభజించి వాటికి సరఫరా చేయాలని సూచించారు. లోఓల్టేజ్ సమస్య నివారణకు కెపాసిటర్లు పెంచాలని, పవర్ డిస్ట్రిబ్యూషన్ లైన్లను ఆధునీకీకరించాలని, సబ్‌స్టేషన్ల వారీగా విద్యుత్ సమస్యలకు చెక్‌పెట్టాలని, ఆగస్టు నెలాఖరు నాటికి విద్యుత్ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించి మెరుగైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకంపై ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ల ఏర్పాటుపై చొరవ చూపాల్సిందిగా కోరారు. సమీక్షలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయ భూముల సర్వే పూర్తిచేయాలి : జేసీ



అమలాపురం, జూలై29(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థాన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి, దేవాదయశాఖ అధికారులు, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులతో కలిసి రీసర్వే పురోగతిపై సమీక్షించారు. దేవస్థానం భూముల రీసర్వే ఆలస్యం కావడంపై భక్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. కేశవదాసుపాలెం, అంతర్వేది, శృంగవరప్పాడు, గొంది గ్రామాల్లో మొత్తం 895 ఎకరాల భూమి దేవస్థానానికి చెందినదని జేసీ చెప్పారు. ఇందులో 726 ఎకరాల కొబ్బరితోటలు, ఆక్వా చెరువులు వ్యవసాయ భూములుగా ఉండి వాటి నుంచి అద్దెలు, లీజుల ద్వారా ఆదాయం లభిస్తోందని ఈవో వరప్రసాద్ చెప్పారు. మిగిలిన 39 ఎకరాల దేవస్థానం ప్రత్యక్ష ఆధీనంలో ఉన్నాయని చెప్పారు. ఆలయ భూములకు రీసర్వే ఇంకా పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఆగస్టు 5న రెండో సమీక్షా సమావేశం జగుతుందన్నారు. డీఆర్వో రాజకుమారి, ఆర్డీవో కె.మాధవి, దేవదాయశాఖ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.



నోట్ల.. కట్టలు..గుట్టలు!

ఉమ్మడి జిల్లాలో 145 కోట్లు

బ్యాంకుల్లో అన్ క్లయిమ్డ్ డిపాజిట్లు

- » ఉమ్మడి జిల్లాలో రూ.145కోట్లపైనే
- » పదేళ్లపైనుంచీ ఖాతాల్లో డబ్బులు
- » బ్యాంకుల్లో లావాదేవీలు నిల్
- » అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా గుర్తింపు
- » ప్రభుత్వ బ్యాంకుల్లో రూ.90 కోట్లు
- » ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ,ఐసీఐసీఐ
- » 330 బ్రాంచ్‌ల్లో కోట్లు
- » ఆర్‌బీఐకి పంపేసిన బ్యాంకులు
- » ఆధారాలతో వెళితే ఇచ్చేస్తారు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పదేళ్లకుపైగా ఏ మాత్రం లావాదేవీలు జరగని అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు రూ.145 కోట్లకుపైగా ఉన్నట్టు అంచనా వేశారు. ఈ డబ్బు కోసం పదేళ్ల నుంచీ ఎవరూ రాకపోవడంతో వాటిని ఆర్‌బీఐకి పంపేశారు. స్టేట్‌బ్యాంకు, యూనియన్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకు తదితర ప్రభుత్వరంగ బ్యాంకు బ్రాంచ్‌ల్లో రూ.90 కోట్ల వరకు డబ్బు పేరుకుపోయింది. ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ తదితర బ్యాంకుల్లో రూ.35 కోట్ల వరకు నగదు ఉండిపోయింది. కొన్ని బ్యాంకు ఖాతాల్లో రూ.లక్షల్లో నగదు ఉండిపోయినట్టు బ్యాంకులు గుర్తించాయి. అత్యధికంగా ఈ తరహా కేసులు నగరాలు, పట్టణాల పరిధిలో ఉన్నట్టు బ్యాంకులు విశ్లేషించాయి. ఆర్‌బీఐకి బదిలీ చేసిన తర్వాత ఖాతాలో బయటకు సున్నా బ్యాలెన్స్ చూపిస్తుంది. అందులో ఉండిపోయిన నగదు ఆర్‌బీఐ వద్దే ఉంటుంది.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల్లో జనం డబ్బు మూలుగుతోంది. ఏళ్ల తరబడి తీయకపోవడంతో కోట్లకు కోట్లు పేరుకుపోతోంది. ఒకటి కాదు రెండుకాదు... పదేళ్లకుపైగా ఆయా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు తీయకపోవడంతో అవన్నీ అన్ క్లయిమ్డ్ డిపాజిట్లుగా మారిపోతున్నాయి. ఆ డబ్బులను బ్యాంకులు చూసీచూసీ ఆర్‌బీఐకి పంపించేస్తున్నాయి. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 35 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 330 బ్రాంచ్‌ల్లో దాదాపుగా రూ.145 కోట్లకుపైగా నగదు అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా బ్యాంకులు గుర్తించాయి. అత్యధికంగా ఎస్‌బీఐ, యూబీఐ తదితర బ్యాంకుల్లో డబ్బులు కోట్లలో పోగుపడగా, తర్వాత ప్రైవేటుబ్యాంకుల్లోను ఉన్నాయి.

పదేళ్లు దాటితే అంతే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ,ప్రైవేటు బ్యాంకులు 35 వరకు ఉండగా వీటన్నింటికి కలిపి 330 వరకు బ్రాంచ్‌లు న్నాయి. వీటిలో ప్రజలు మొత్తం రూ.48,500 కోట్ల వరకు డిపాజిట్లు చేశారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే రూ.21,307 కోట్లు ఉన్నాయి. ఖాతాదారులు సేవింగ్స్, కరెంట్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో డబ్బులు పొదుపు చేస్తారు. తరచూ ఖాతాలో డబ్బులు జమ చేయడం, విత్‌డ్రా చేసుకోవడం జరుగుతుంది. కానీ కొన్ని సేవింగ్స్ కరెంట్ ఖాతాలు మాత్రం ఏళ్ల తరబడి అసలు ఏ లావాదేవీ జరగకుండా ఉండిపోతున్నాయి. వీటిలో ఉన్న డబ్బులను విత్‌డ్రా చేసుకోవడానికి ఎవరూ రావడం లేదు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఇలా ఏలావాదేవీ జరగని బ్యాంకు ఖాతాలపై ఆయా బ్రాంచ్‌లు కన్నేసి ఉంచుతాయి. తొలుత రెండేళ్ల పాటు ఏ లావాదేవీ జరగని ఖాతాలుంటే వాటిని నిర్వహణలో లేని ఖాతాగా గుర్తిస్తారు. బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉండి కూడా పదేళ్ల వరకు వాటిపై ఏలావాదేవీ జరగకపోతే దాన్ని అన్‌క్లయిమ్డ్‌గా భావిస్తారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఇలా పదేళ్ల పాటు ఉండిపోయిన బ్యాంకు ఖాతాలను ఆయా బ్యాంకులు ఆర్‌బీఐకి పంపాల్సి ఉంటుంది. దీన్నే డీఈఏ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్)గా పిలుస్తారు. ఒకవేళ ఆర్‌బీఐకి ఈ తరహా బ్యాంకు ఖాతాలను పంపకపోతే అందులో ఉన్న ఖాతాదారుల డబ్బు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉన్నందున పదేళ్లు దాటిన ఖాతాల సొమ్మును ఆర్‌బీఐకి బ్యాంకులు పంపుతాయి.

కొవిడ్ తర్వాత ఇలా..

కొవిడ్ తర్వాత అనేక బ్యాంకు ఖాతాలు అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా మారినట్టు బ్యాంకులు చెబుతున్నాయి. రిజర్వుబ్యాంకు ఆదేశాల మేరకు 2023లో 100 రోజులు 100 పేమెంట్స్ కింద అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు తిరిగి చెల్లించేందుకు శ్రీకారం చుట్టింది.ప్రతి జిల్లాలో ప్రతి బ్యాంకు తమ టాప్ 100 అన్ క్లెయిమ్ డిపాజిట్లకు సంబంధించి ఖాతాదారులను గుర్తించి నగదు సెటిల్ చేయాలని కోరింది. కానీ ఉమ్మడి జిల్లాలో పెద్దగా ఈ ప్రయోగం ఫలించలేదు. ఖాతాదారులకు అందించేందుకు ఆర్‌బీఐ ఉద్గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు -గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్)పేరిట సెంట్రల్ వెబ్ పోర్టల్‌ను 2023 ఆగస్టులో ప్రారంభించింది. దీని ద్వారా రిజిస్టర్ వినియోగదారులు అన్ని బ్యాంకుల్లోని అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల సమాచారం పొందేలా వివరాలు ఉంచింది.ఎవరికైనా అనుమానం ఉంటే రిజి స్టర్ అయి చెక్ చేసుకోవచ్చని సమాచారం. లేదంటే బ్యాంకులకు వెళ్లి వివరాలు కోరినా చెప్పే అవకాశం ఉంది.

తెలియక కొండలా..

ఖాతాదారుడి అకౌంట్‌లో డబ్బులు ఉన్నా ఆ తర్వాత చనిపోయిన ఘటనల్లో ఈ తరహా డిపాజిట్లు పేరుకుపోతున్నట్టు లీడ్‌బ్యాంకు అధికారులు వివరించారు. ఖాతాదారుడు అవివాహితుడో.. లేదంటే గుర్తుతెలియని ప్రదేశాల్లో చనిపోయి ఇప్పటికీ ఆచూకీ దొరకని ఘటనలు, ఖాతాదారుడు చనిపోగా, పిల్లలు,ఇతర రక్తసంబంధీకులు విదేశాల్లో ఉండిపోయి ఇక్కడకు రాని ఘటనల్లో ఈ తరహా అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు పెరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఖాతాదారుడి అకౌంట్లో డబ్బులున్నా సదరు వ్యక్తి మరణం తర్వాత ఆ విషయం వారసులకు తెలియని ఘటనలు సైతం ఇందుకు దోహదం చేస్తున్నాయని తెలిపారు. కొందరు ఖాతాల్లో డబ్బులున్నట్టు గుర్తించి విత్‌డ్రాకు ప్రయత్నిస్తున్నా వారసత్వ ధ్రువీకరణ విషయంలో ఇబ్బందులు ఇందుకు కొంత కారణంగా మారుతున్నాయి. అనేకమంది ఫలానా ఖాతా తమ వారిదేనని వస్తున్నా అందుకుతగ్గ సరైన ఆధారాలు చూపడం లేదని బ్యాంకులు పేర్కొంటున్నాయి.



మత్స్యకార సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మత్స్యకార సంఘాలు బలోపేతం కావాలి : ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకార కుటుంబాల ఆర్థిక స్వావలంబన కోసం పలు పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి సంఘాలు బలోపేతం కావాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో రాజోలు నియోజకవర్గంలోని 33 మత్స్యకార సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో 20 వేలమంది మత్స్యకారులు 28 గ్రామాల్లో 5వేల కుటుంబాలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్రం ప్రధాని మత్స్య సంపద యోజన, రాష్ట్రం కిసాన్ సమృద్ధి యోజన పథకాలను అమలు చేస్తున్నాయని, ఎఫ్ఎఫ్‌పీవో పథకంలో సంఘాలుగా రిజిస్టర్ అయి సక్రమ రికార్డులు నిర్వహిస్తూ ప్రభుత్వం అందించే లబ్ధిని పొందాలన్నారు. దీనికోసం అవసరమైతే అధికారులను అందుబాటులో ఉంచుతానన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం సమగ్ర గ్రామాభివృద్ధి పథకంలో గ్రామాల అభివృద్ధికి ఏడున్నర కోట్లు చొప్పున ఇస్తుందని, వాటిలో కరవాక, అంతర్వేది పల్లిపాలెం గ్రామాలను ఎంపిక చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకార భృతిని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచిందన్నారు. అంతర్వేది పల్లిపాలెం హార్బర్ అభివృద్ధికి అని చర్యలు తీసుకున్నామని, కరవాక హార్బరును పరిశీలించి దాని అభివృద్ధికి కూడా చేయూతనిస్తానన్నారు. తూర్పుపాలెంలో పీతల హేచరీ ఏర్పాటుకు రూ.2.75 కోట్లు మంజూరుకాగా, స్థల సేకరణ జరిగిన వెంటనే ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు మాట్లాడుతూ జగన్ హయాంలో మత్స్యకారులను అణగదొక్కారని, ఏ పథకం అమలు చేయలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ మత్స్యకార సంఘాలు సక్రమమైన రికార్డులను ఏర్పాటు చేసుకుని తప్పనిసరిగా ఆడిట్‌లు చేయించుకోవాలన్నారు. సమావేశంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజులను గజమాలలతో సత్కరించారు. సమావేశంలో పాల్గొన్న అతిథులను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు బలశాలి రంగారావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అద్భుత ప్రయోగాల గని అంతరిక్షం

- విద్యార్థులు అంతరిక్ష పరిశోధకులుగా ఎదగాలి
- కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి
- అంతరిక్ష అవగాహన శిబిరంలో ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో సమస్త ప్రపంచాన్ని శాసించే శక్తి కేంద్రాలకు అంతరిక్షమే నిలయం కానుంది. ప్రపంచ మానవాళి అంతరిక్షం కేంద్రంగానే నేడు ఎన్నో సేవలను పొందుతోంది. ఇంట్లో కూర్చుని టీవీ చూడగలుగుతున్నా, సెల్‌ఫోన్ వినియోగిస్తున్నా, శాటిలైట్ సినిమాలు చూడాలన్నా, వినాశకర యుద్ధ పరికరాలకు సిగ్నల్స్ అందాలన్నా అంతరిక్షమే కేంద్రంగా ఉంది. అటువంటి అంతరిక్షంలో ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయి. చంద్రుడు, అంగారకుడు వంటి ఎన్నో గ్రహాలు ఉన్నాయి. ఆయా గ్రహాల్లో నీరు ఉందా. జీవరాశులు ఉన్నాయా,మానవ మనుగడకు అవకాశం ఉందా. విలువైన ఖనిజ సంపదలు ఉన్నాయా ఇలా ఎన్నింటినో తెలుసుకునేందుకు నిరంతరం పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి. అటువంటి పరిశోధనల్లో భాగంగా భవిష్యత్తులో విద్యార్థులను అంతరిక్ష పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా అంతరిక్ష అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతరిక్ష అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభ రీతిలో అర్థమయ్యేలా ప్రాక్టికల్స్ కోసం అమలాపురంలో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా, ముస్కాన్ సంస్థల సహకారంతో నిర్వహించిన అంతరిక్ష అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి టెలిస్కోప్‌ను పరిశీలించారు. ఏఆర్‌వీఆర్ పరికరంతో అంతరిక్షంలోని వింతలను వీక్షించారు. డ్రోన్ల వినియోగాన్ని ప్రాక్టికల్‌గా విద్యార్థులకు దగ్గరుండి చూపించారు. రోబోటిక్స్ వర్చువల్ రియాలిటీ అనే అంశాలను స్పేస్ ఎడ్యుకేటర్లు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ సైన్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం రూ.20లక్షల అంచనా వ్యయంతో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ప్రయోగపూర్వకంగా సైన్స్‌ను వివరిస్తే విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోరన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను అంతరిక్ష పరిశోధకులుగానే కాకుండా భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే సైన్స్ సెంటర్ల లక్ష్యమన్నారు. విద్యార్థులు ఇంజనీరింగ్‌లో సాఫ్ట్‌వేర్ రంగం ఒకటే ఉందనుకుంటే పొరపాటు. ఇస్రో, నాసావంటి అంతరిక్ష పరిశోధనా సంస్థల్లో అద్భుత అవకాశాలు ఉన్నాయి. ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ 300 ఏళ్ల చరిత్ర గల అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలను పెంచుకోవాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.మమ్మీ కోరారు. ప్రతి శాస్త్రోత్సవ ప్రదర్శనలో సీవీ రామన్ త్రీడీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కంభంపాటి హరిసూర్యనారాయణ రూ.20వేలు విరాళాన్ని ఎమ్మెల్యే ఆనందరావుకు అందించగా ఆయన జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యానికి అందజేశారు. సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, ముస్కాన్ సీఈవో ప్రాణేష్ దేవ్‌నాథ్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బీర హనుమంతరావు, సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ ఘన సత్యనారాయణ, సైన్స్ ఫోరం అధ్యక్షుడు బెహరా సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్ సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.





గాగుల్స్‌తో అంతరిక్షాన్ని చూస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు







విద్యార్థుల సమక్షంలో డ్రోన్లతో పాటు ఇతర ప్రదర్శనలు



పాఠశాల స్థాయి నుంచి ప్రోత్సహించడమే లక్ష్యం



కేశినేని వెంకటేశ్వర్లు, సీఈవో, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతి

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా పది కేంద్రాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తాం. బుడమేరు వరదల సమయంలో డ్రోన్స్ ఉపయోగించి పేదలను ఆదుకున్న విధానాలను వివరించడంతో పాటు చంద్రయాన్-2 ప్రయోగాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. మాజీ రాష్ట్రపతి, అంతరిక్ష పరిశోధకుడు అబ్దుల్ కలాం స్ఫూర్తితో భవిష్యత్తు శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేందుకు సైన్స్ సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

గాగుల్స్‌తో అంతరిక్షంలోకి వెళ్లా



ముంగండ లోహిత, 9వ తరగతి, గూడాల

అంతరిక్ష అవగాహన శిబిరంలో భాగంగా గాగుల్స్ ధరించా. అవి పెట్టుకోగానే అంతరిక్షంలోకి వెళ్లడమే కాదు పక్క నుంచి రాకెట్లు వెళ్తున్నట్టు కనిపించింది. అంతరిక్షంలో ఎన్నో వింతలు చూడగలిగా. ఏఆర్‌వీఆర్ పరికరం ధరించగానే అంతరిక్ష అద్భుతాలు దర్శనమిచ్చాయి. అంతరిక్షంలో అన్ని వింతలు ఉన్నాయా అనిపించింది.

రాకెట్ తయారీలో పాల్గొనాలని ఉంది



ఓదూరి గోవర్ధన్‌వెంకటదుర్గ 10వ తరగతి, అమలాపురం

రాకెట్ తయారీ నమూనాను చూపించారు. తీసుకువచ్చిన రాకెట్ నమూనాను పూర్తిగా విడదీసి లోపల ఏమేమి ఉంటాయో చూపించారు. తిరిగి విద్యార్థులతోనే రాకెట్‌ను తయారు చేయించిన తీరు అద్భుతం. భవిష్యత్తులో రాకెట్ తయారీలో పాల్గొనాలని ఉంది. గ్రహాలపైకి వెళ్లే రోవర్స్ ఫొటోలు తీసే విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరిగింది



ఎస్.మాధురి, స్కూలు అసిస్టెంట్, ఫిజికల్ సైన్స్, మూలపొలం

అంతరిక్ష అవగాహన శిబిరంతో విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు పుస్తకాల్లోను, టీవీల్లోను మాత్రమే రాకెట్ ప్రయోగాలను చూశారు. రాకెట్లను నేరుగా అంతరిక్షంలోకి ప్రయోగించే విధానాలను వివరించిన తీరు అద్భుతం. పాఠ్యాంశాలను ప్రాక్టికల్‌గా చూపించడం ద్వారా విద్యార్థులు స్పేస్ సైన్స్‌పై ఆసక్తి పెంచుకుంటున్నారు.



బీచ్ రోడ్డును తాకుతున్న అలలు

అలలు ఎగసి... రోడ్డును ఛిద్రం చేసి...

- కొత్తపట్నం వద్ద ధ్వంసమైన రహదారి
- గోతుల్లో పడి గాయాలపాలవుతున్న వాహనచోదకులు

కొత్తపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉవ్వెత్తున ఎగసిపడుతున్న రాకాసి అలల ధాటికి కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో బీచ్ రోడ్డు ధ్వంసమవుతోంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పాటు సముద్రంలో ఏర్పడే పోటు, పాట్లతో అలలు తాటి చెట్టు ఎత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో ఉప్పాడ-కాకినాడ మార్గంలో కొత్తపట్నం వద్ద బీచ్ రోడ్డు ఛిద్రమైంది. రాత్రిపూట మోటారు సైకిళ్లపై వెళ్లేవారు ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురులో అగాథాల్లాంటి గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. తక్షణం మరమ్మతులు చేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.





ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో కొత్తపట్నం వద్ద ఛిద్రమైన రోడ్డు

స్మార్ట్ సిటీకి రూ.485 కోట్లు వినియోగం

- కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోకహాన్ సాహూ
- రాజ్యసభలో పలు కీలక అంశాలను ప్రస్తావించిన ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాజ్యసభల ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పలు కీలక అంశాలు ప్రస్తావించారు. స్మార్ట్ సిటీస్ మిషన్ అమలు వివరాలపై, జాతీయ ఖనిజ అన్వేషణ నిధి కింద రాష్ట్రంలో జరుగుతున్న ప్రాజెక్టులపై ఎంపీ సతీష్‌బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ అంశాలపై కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోకహన్ సాహూ సమాధానం ఇచ్చారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద దేశవ్యాప్తంగా 100 నగరాలు ఎంపిక చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం నగరాలు ఈ మిషన్ కింద ఉన్నాయన్నారు. మొత్తం రూ.48 వేల కోట్లు కేంద్ర నిధుల మంజూరు చేయగా, ఇప్పటి వరకు రూ.47,459 కోట్లు నిధులు 99శాతం నగరాలకు విడుదలయ్యాయన్నారు. కాకినాడ స్మార్ట్ సిటీకి కేంద్రం రూ.490 కోట్లు మంజూరు చేయగా, రూ.485 కోట్లు ఖర్చు చేశారన్నారు. 2025 జూలై 11వ తేదీ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ మిషన్ కింద మొత్తం 280 ప్రాజెక్టులు చేపట్టారని సహాయ మంత్రి సాహూ తెలిపారు. అలాగే జాతీయ ఖనిజ అన్వేషణ నిధిపై అడిగిన ప్రశ్నకు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నాలుగు ఎన్ఎంఈటీ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. వీటి కోసం రూ.11 కోట్లు మంజూరయ్యాయని, ప్రధానంగా నికెల్, రెయిన్‌ఎర్త్ ఎలిమెంట్స్ వంటి ఖనిజాల అన్వేషణకు ఈ ప్రాజెక్టులు దోహదపడుతున్నాయన్నారు. అలాగే పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్‌లపై అడిగిన ప్రశ్నకు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాట ర్వేస్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానం ఇవ్వగా, ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీహర్ష్ మల్హోత్రా సమాధానమిచ్చారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన మక్కల్ నీది మయ్యం(ఎంఎన్ఎం) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలహాసన్‌ను పార్లమెంట్ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రాజ్యసభకు ఎన్నికైన కమలహాసన్‌ను పార్లమెంట్ భవన్‌లో కలిసిన సతీష్‌బాబు

పట్టులో దిగుబడి, నాణ్యత కీలకం

మైసూరు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ గాంధీదాస్



చేబ్రోలులో పట్టుగూళ్లను పరిశీలిస్తున్న డాక్టర్ గాంధీదాస్

గొల్లప్రోలు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టులో దిగుబడితో పాటు నాణ్యత కీలకమని, ఈ దిశగా రైతులకు పూర్తి సహకారం అందజేస్తామని మైసూరు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఎస్.గాంధీదాస్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఫంక్షన్ హాలులో మేరా రేషమ్-మేరా అభిమాన్(నా పట్టు-నా అభిమానం) కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సిల్క్ సమగ్ర-3 కార్యక్రమంలో భాగంగా పట్టు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అసంపూర్ణంగా ఉన్న మార్కెట్ షెడ్డును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టుపరిశ్రమ శాఖ రాష్ట్ర అదనపు సంచాలకురాలు అరుణకుమారి మాట్లాడుతూ పట్టు రైతులకు ఇన్సెంటివ్ బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా విడుదల చేస్తామన్నారు. యాంత్రీకరణ సహా అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సదస్సులో పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పట్టు పరిశ్రమ శాఖ అధికారులు పాల్‌రాజు, కోనేటి అప్పారావు, సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ మురళి, బి.వజ్రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- ఎటపాక జవహర్ నవోదయలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు
- తొలిరోజు పాల్గొన్న 8 క్లస్టర్ల విద్యార్థులు



ఎటపాకలో టేబుల్ టెన్నిస్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎటపాక, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు మంగళవారం నుంచి ఉల్లాసంగా ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతోపాటు అండమాన్ నికోబార్, లక్షద్వీప్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కృష్ణా, కడప, ఖమ్మం, షిమోగా, తుంకూర్, పతనంతిట్ట, వయనాడ్, బీదర్ క్లస్టర్ల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు నిర్వహించిన పోటీల్లో 40 మంది విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. అంతకుముందు టెబుల్ టెన్నీస్ పోటీలు ప్రారంభ సమయంలో మార్చ్ ఫాస్ట్‌తో గౌరవ వందనం సమర్పించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగనున్నాయి. తొలుత ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశానికి మంచిపేరు తేవాలి

పెద్దాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా దేశానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావచ్చని ప్రముఖ పారిశ్రామికవేత్త, లలిత ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని పీఎంశ్రీ నవోదయ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రాంతీయ కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, విద్యతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. తమ లక్ష్యాలను విద్యార్థి దశలోనే నిర్దేశించుకోవాలన్నారు. నవోదయ విద్యాలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సీతలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీనివాస్

ఆహ్లాదంగా నన్నయ యూనివర్శిటీ: వీసీ



ఉడ్‌చిప్పర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూలై 29(ఆంధ్రజ్యోతి): నన్నయ విశ్వవిద్యాలయానిన అహ్లాదకర ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్శిటీ సుందరీకరణలో భాగంగా చెట్ల కొమ్మలు, పాదలు వ్యర్థాలను చిప్స్‌గా మార్చే షైజోవీమా ఉడ్‌చిప్పర్ యంత్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ప్రాంగణంలోని చెట్లు, మొక్కల వ్యర్థాలను చిప్స్‌గా మార్చేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుందని, ఈ చిప్స్‌ను కంపోస్టు ఎరువుగా లేదా ఇతర అవసరాలకు ఉపయోగిస్తామన్నారు. ప్రకృతి నుంచి వచ్చిన దానిని తిరిగి ప్రకృతికి అందించి పర్యావరణ సమతుల్యత పాటించవచ్చునని వీసీ అన్నారు. కార్యక్రమంలో డీన్ ఇన్‌చార్జి అధికారి బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ శిక్షణకు సంధ్యారాణి ఎంపిక



సంధ్యారాణికి ప్రొసీడింగ్స్ అందిస్తున్న డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీపురం సుంకర భాస్కరరావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంటుగా పనిచేస్తున్న కందనాల సంధ్యారాణి బెంగుళూరులోని రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్‌లో నిర్వహించే (స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) 30 రోజుల కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తూర్పుగోదావరి జిల్లాలోని మునిసిపల్ హైస్కూలు నుంచి సంధ్యారాణి ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి అవసరమైన ప్రొసీడింగ్స్ సంధ్యారాణికి అందజేశారు. ఈ అవకాశం రావడానికి సహకరించిన స్కూలు హెడ్మాస్టర్ సన్యాసిరావుకు సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు.

గోదావరి తగ్గుముఖం

6,01,844 క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి పెరుగుతూ తగ్గుతూ ప్రవహించిన గోదావరి ఎగువ ప్రాంతాల్లో తగ్గుముఖం పడుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి 6,01,844 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదయ్యింది. ఎగువన భద్రాచలం వద్ద 36.60 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 34.80 అడుగులకు తగ్గింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4300, మధ్య డెల్టాకు 2600, పశ్చిమ డెల్టాకు 6000 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా కామాచార్యులు

కాకినాడ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన రామోజు నాగ వెంకటసత్య కామాచార్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం న్యాయ శాఖ జీవోఆర్‌టీ నెం.264 జారీ చేసింది. ఈ అథారిటీలకు సంబంధించిన కేసులను హైకోర్టులో ఈయన వాదిస్తారు. మూడు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.



ఎంపీ పురందేశ్వరితో ఒడిసా గవర్నర్ భేటీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు భేటీ అయ్యారు. మంగళవారం పురందేశ్వరి నివాసానికి హరిబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలను వారిరువురు కొద్దిసేపు చర్చించుకున్నారని ఎంపీ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

గ్రీన్‌ట్యాక్స్ రద్దుపై హర్షం

- లారీ రవాణా రంగాన్ని ఆదుకోవాలి
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబ్జీ

కాకినాడ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ట్యాక్స్ రద్దుతో ప్రభుత్వం రవాణా రంగానికి ఎంతో మేలు చేసిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన నాగరాజు, జనసేన నాయకుడు హర్షం వ్యక్తం చేశారు. గ్రీన్‌ట్యాక్స్ రద్దు సందర్భంగా ఆయన కాకినాడ రూరల్ మండలం తూరంగి బొడ్డు చెరువు వద్దనున్న తన కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశంలో 26 యూనియన్ల సభ్యులు పాల్గొన్నారని, మూడు జిల్లాల్లోని కలెక్టర్లకు లారీ ఓనర్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా వివరించామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన లారీ రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఏటా టోల్‌ప్లాజా చార్జీలు పెరగడం వల్ల రవాణా రంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. రవాణారంగంపై వివిధ రకాల పన్నులు, రుసులు పెంచారని, రవాణా కోసం వస్తువులను, లోడ్, అన్‌లోడ్ జరిగేటప్పుడు, లారీ యజమానికి కిరాయి రాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. లారీ యజమానుల సమస్యలపై కలెక్టర్‌కు త్వరలోనే వినతిపత్రం అందజేస్తామన్నారు.సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వామినాయుడు, సూర్యనారాయణరాజు, అర్జుబాబు, దుర్గాప్రసాద్, నానాజీ,వీరవెంకటరత్నం పాల్గొన్నారు.

ఏం కావాలో తెలుసుకోండి!

- నేటి నుంచి కుటుంబ అవసరాల సర్వే ప్రారంభం
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీ4 బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం 2లక్షల19వేలు
- ఆగస్టు 15 కల్లా ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు



కలెక్టరేట్ (కాకినాడ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు మంచిరోజులొస్తున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అసలు పీ4 పరిధిలో ఉన్న బంగారు కుటుంబాల అవసరాలు ఏంటో తెలుసుకోవడానికి కుటుంబ అవసరాల(నీడ్ అసెస్మెంట్) సర్వే చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. బుధవారం నుంచి ఆ సర్వే ప్రారంభం కానుంది. ఆగస్టు 15వతేదీ కల్లా పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

జిల్లాలవారీగా లెక్కలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2లక్షల 19వేల బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు మార్గదర్శులను గుర్తించాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ఇప్పటి వరకు 62వేల బంగారు కుటుంబాలను మార్గదర్శులను గుర్తించారు. దీనిలో పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్ జీవోలు ఉన్నారు. దీనిలో కాకినాడ జిల్లాలో లక్షా2వేల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం కాగా ఇప్పటి వరకు 35వేల కుటుంబాలను దత్తత స్వీకరించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 60వేల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు 15వేల కుటుంబాలను దత్తత స్వీకరణ జరిగింది. తూర్పుగోదావరి జిల్లా విషయానికి వస్తే 57వేల బంగారు కుటుంబాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 12వేల బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి కొంతమంది మార్గదర్శులు ముందుకొస్తున్నప్పటికీ వారి అవసరాలు ఏంటో ముందే తెలుసుకోవాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో కుటుంబ అవసరాల(నీడ్ అసెస్మెంట్) సర్వే చేయడానికి సర్వం సిద్ధం చేసింది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపకల్పన చేసింది. ఈ యాప్‌ను ఇప్పటికే కాకినాడ జిల్లా, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉద్యోగులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాల్లో బుధవారం నుంచి సర్వే ప్రారంభంకానుంది. తూర్పుగోదావరి జిల్లాలో గురువారం నుంచి గానీ, శుక్రవారం నుంచి గానీ ఈ సర్వే చేయనున్నారు. ఈ జిల్లాలో యాప్ డౌన్‌లోడ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

వారిపై ప్రత్యేక దృష్టి...

బంగారు కుటుంబాల్లో వితంతువులు, ఒంటరి మహిళలపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరిస్తారు. వీరికి ఇతర కుటుంబసభ్యుల మద్దతు ఉందా లేదా అనే విషయాలను విచారణ చేస్తారు. ఒంటరి మహిళల అవసరాలను తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తారు. పింఛన్, ఇతర ఆర్థిక సాయాలు ఏం అందుతున్నాయి వంటి వివరాలు సర్వే ద్వారా తెలుసుకుని నమోదు చేస్తారు.

సచివాలయ ఉద్యోగుల ద్వారా సర్వే

కుటుంబ అవసరాల సర్వే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల ఆధ్వర్యంలో సర్వే జరుగుతుంది. ప్రభుత్వం వీరికి ఇచ్చిన ప్రత్యేక యాప్ ద్వారా ఆయా బంగారు కుటుంబాల వద్దకు వెళ్తారు. ఆయా కుటుంబాల అవసరాలను తెలుసుకుని దానిలో నమోదు చేస్తారు. ఉదాహరణకు ఒక కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే వారిలో ఎంతమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయి... వారు ఎలాంటి విద్యార్హత కల్గి ఉన్నారు.. ఎలాంటి ఉపాధి కల్పిస్తే ఆర్థికంగా నిలబడతారు.. వంటి అంశాలు పరిశీలిస్తారు. ఆయా బంగారు కుటుంబాలు ప్రధానంగా ఎలాంటి సమస్యవల్ల సతమత మవుతున్నా రు వంటి అంశాలను విచారణ చేసి నమోదు చేస్తారు.

కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ప్రారంభించిన బంగారు కుటుంబాల దత్తతకు జిల్లాలో కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు, పరిశ్రమల యాజమాన్యం, గ్యాస్ ఏజెన్సీలు, హేచరీలు, పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ముందుకు రావాలి. ఎన్‌జీవోలు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించాలి. దీని వల్ల పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తేవాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. బంగారు కుటుంబాల మార్గదర్శకులు దత్తత స్వీకరణ కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది.

– కాకినాడ జిల్లా కలెక్టర్, షాన్‌మోహన్

ఏలేరుకు గోదావరి జలాలు



ఏలేరులోకి చేరిన గోదావరి జలాలు

ఏలేశ్వరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు మంగవారం గోదావరి జలాలు ప్రవేశించాయి. ప్రాజెక్టులోకి 175 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జగ్గంపేట మండలం రామవరం వద్ద స్టేజీ2 నుంచి పంపుల ద్వారా నీటిని ఏలేరుకు తరలిస్తున్నారు. గోదావరి జలాలు ఏలేరుకు చేరడంతో ప్రాజెక్టుపై ఆధారపడిన సుమారు 56వేల ఎకరాలకు సాగు సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఇన్నాళ్ల ప్రాజెక్టులో కేవలం 10.46 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ఈ నీటినే పంపుల ద్వారా విశాఖకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు సాగుపై ఆందోళన ఏర్పడింది. ఇప్పుడు గోదావరి నీరు వస్తుండడంతో రైతుల ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ప్రాజెక్టు స్థితిగతులు

ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్ల ఎత్తున 24.11 టీఎంసీలను నిల్వచేయవచ్చు. వర్షాలు కురవకపోవడంతో నీరు చేరలేదు. దీని వల్ల వారంక్రితం వరకు ప్రాజెక్టులో కేవలం 10.31 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఏలేరులో 77.25 మీటర్ల స్థాయిలో 10.46 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ఖరీఫ్ సాగుకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా నీరు విడుదల చేస్తామని ఏలేరు అధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం సాగుకు 1300 క్యూసెక్కుల వంతున, ఎ డమ కాలువ నుంచి విశాఖకు 200 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని చెప్పారు.

మద్యం షాపుపై పోలీసుల దాడి

పలువురికి గాయాలు



గాయపడి చికిత్స పొందుతున్న రాజీవ్

కరప, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో ఒక మద్యం దుకాణాన్ని పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేసి మద్యం సేవిస్తున్న వారిపై దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిత్ర గార్డెన్ ఎదురుగా ఉన్న తిరుమల వైన్స్ వద్దకు సోమవారం రాత్రి 9 గంటల సమయంలో పోలీసులు వచ్చి బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై దాడి చేశారు. రాజీవ్ అనే వ్యక్తి చేతులకు రక్తపు గాయాలు కాగా మిగిలిన వారు తలో దిక్కుకు పరుగులు తీశారు. మద్యం దుకాణం సిబ్బంది బాధితుడికి చికిత్స చేయించారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై కరప ఎస్ఐ సునీతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పోలీసులు దాడి చేయడం అవాస్తవం అన్నారు. ప్రధాన రహదారిని చేర్చి ఉన్న 2 మద్యం దుకాణాలపై ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో వాటిని నిరోధించే ప్రయత్నంలో పోలీసులు అక్కడి వెళ్లారని తెలిపారు. పోలీసులను చూసి పారిపోతుండగా ఒక వ్యక్తికి చేతులకు రేకులు గుచ్చుకుని రక్తపు గాయాలయ్యాయ న్నారు. నూసెన్స్ కలిగిస్తున్న 2మద్యం దుకాణాలపై బైండోవర్ కేసులునమోదు చేస్తామన్నారు.

పదో తరగతి విద్యార్థినికి గర్భం..

పాఠశాల కరస్పాండెంట్‌పై పోక్సో కేసు

పరారీలో నిందితుడు

కోనసీమ జిల్లా డీఈవో విచారణ



స్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో సలీం బాషా

రాయవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిని లోబర్చుకుని గర్భవతిని చేసిన కరస్పాండెంట్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని ఓ గ్రామంలోని ప్రైవేటు ఫౌండేషన్ స్కూల్ కరస్పాండెంట్ ఎ.షాజీ జయరాజ్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. 10వతరగతి బాలికపై కన్నేసి కొన్ని నెలల క్రితం బెదిరించి గర్భవతిని చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఈనెల 28న రాయవరం పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో జయరాజ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్టు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆ ఫౌండేషన్ స్కూల్‌ను మంగళవారం కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తనిఖీ చేశారు. 8,9,10 తరగతులు అనుమతులు లేకుండా ఏ విధంగా నిర్వహిస్తున్నారు అనే విషయాన్ని డీఈవో ఆరా తీశారు. పాఠశాల యాజమాన్యంపై సమగ్రమైన దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలిక కుటుంబ సభ్యులను కలిసి సంఘటనపై ఆరా తీశారు. డీఈవోతో పాటు ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్ బాబు, ఐసీడీఎస్ అధికారులు బాలిక కుటుంబ సభ్యులను కలిసి విచారణ జరిపారు. కాగా కరస్పాండెంట్ జయరాజ్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు వెతుకుతున్నారు.

దళితుడిపై దాడి కేసులో మరో నిందితుడి అరెస్ట్

అమలాపురం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): దళితుడు దోనిపాటి మహేశ్వరరావుపై దాడి చేసిన కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీలక ఆధారాలను సేకరించి ఇప్పటికే ఐదుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. మంగళవారం కోనసీమ జిల్లా ఈదరపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి దుర్గామహేష్ అలియాస్ మహేష్‌ను అతడి ఇంటి వద్ద అరెస్టు చేసి అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితుడికి కోర్టు 14రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన యల్లమిల్లి విజయ్ రవిశంకర్, ఉరదల బాలరాజు, యర్రా కృష్ణ, మల్లాడి సుదర్శన్, తోట నాగవెంకటసత్యనారాయణ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.

దారి దోపిడీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం

విచారణకు 5 ప్రత్యేక బృందాలు

సీసీ కెమెరాల పరిశీలన



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్

గొల్లప్రోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు చెందుర్తి రోడ్డులో జరిగిన దారి దోపిడీ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దోపిడీకి పాల్పడిన ఆగంతకులను గుర్తించి పట్టుకునేందుకు 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు. రాజమహేంద్రవరం నల్లమందు సందులోని భవానీ సిల్వర్ ప్యాలెస్‌లో గుమస్తాగా పనిచేస్తున్న సమీర్ ప్రజాప్రత్ పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలుల్లో వెండి, బంగారు వస్తువులు డెలివరీ ఇచ్చి వారు ఇచ్చిన ముడి వెండి, నగదును తీసుకుని ఎన్‌హెచ్ 216 నుంచి చెందుర్తి వెళ్లే రోడ్డులోకి వెళ్లగా పామాయిల్ తోటల వద్ద సోమవారం రాత్రి 2 మోటార్‌సైకిళ్లపై నలుగురు ఆగంతకుల వచ్చి అతడిపై దౌర్జన్యం చేసి బెదిరించి ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగులను లాక్కుని పరారయ్యారు. ఇందులో 12.5కిలోల వెండి వస్తువులు, ముడి వెండి, 51 గ్రాముల బంగారం వస్తువులు, 60వేలు నగదు ఉన్నట్టు ప్రజాప్రత్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. కేసులో విచారణకు పిఠాపురం సీఐ, సర్కిల్‌లోని నలుగురు ఎస్ఐల నేతృత్వంలో 5 విచారణ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో వారు విచారణ చేపట్టారు. పిఠాపురం నుంచి గొల్లప్రోలు వరకూ, 216వ జాతీయరహదారి వెంబడి ఉన్న గోడౌన్లు, రైసుమిల్లులు, ఇతర భవనాల సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. సంఘటన జరిగిన సమయంలో వెళ్లిన ద్విచక్ర వాహనాలను గుర్తించే పనిలోపడ్డారు. ఇంత భారీ మొత్తంలో వెండి, బంగారు వస్తువులును ఎటువంటి రక్షణ లేకుండా ఎలా తీసుకువెళ్తున్నాడు అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. తెలిసిన వారు చేశారా, లేకా సమీర్ ప్రజాప్రత్ రాకపోకలను గుర్తించి రాజమహేంద్రవరం లేదా పెద్దాపురం, పిఠాపురం నుంచి వెంబడించి ఆగంతకులు ఈ పని చేశారా అనే విషయాన్ని వారు పరిశీలిస్తున్నారు. ఫిర్యాదులోని అంశాలపైనే బాధితుడిని వివిధ కోణాల్లో ప్రశ్నించి వివరాలు రాబట్టారు.

'జయలక్ష్మి సొసైటీ బాధితులను భయాందోళనకు గురిచేయవద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు

సర్పవరం జంక్షన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంపై నిరాధార ఆరోపణలు చేసి బాధితులను భయాందోళనకు గురి చేయవద్దని ఆ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు కోరారు. మంగళవారం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో గల ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సొసైటీ డైరెక్టర్లు చింతా సుబ్బారావు, షేక్ జానీ భాషా, కె గౌరీశంకర్‌లతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.582 కోట్ల ఆర్థిక కుంభకోణం కేసులో సుమారు రూ.80 కోట్లకు మాత్రమే సెక్యూరిటీ ఉందని, మిగతా డిపాజిట్లకు ఎటువంటి ఆధారాలు లేని స్థితి నుంచి సుమారు రూ.500 కోట్లకు పైగా నిందితుల ఆస్తులను గుర్తించి, 13 జీవోలు జారీ కావడ్డాయని, సీఐడీతో ఈ ఆస్తులను జప్తు చేయించి కోర్టులో వేయించడం జరిగిందన్నారు. రూ.300 కోట్ల ఆస్తుల జప్తుపై ట్రిబ్యునల్‌కి వెళ్లగా, ఇందులో 13 కేసులకు సంబంధించి రూ.30 కోట్లపై కోర్టు వాయిదాలకు నిందితులు హాజరుకాకపోవడంతో ట్రిబ్యునల్ కోర్టు నుంచి డిక్రీ ప్రకటన జారీ అయిందన్నారు. దీని ఆధారంగా ఈపీ దాఖలు చేసి సదరు రూ. 30 కోట్లు స్థిరాస్తులను సొసైటీ పేరున దఖలకు అనుకూలంగా తీర్పు ఇవ్వాలని పిటిషన్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు పాలకవర్గ డైరెక్టరు పూర్తి పారదర్శకంగా పని చేస్తున్నామన్నారు. బాధితులకు సత్వర న్యాయం కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేస్తే సత్వరంగా సెటిల్ అవుతాయన్నారు. బాధితుల తరపున జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి లెటర్ రాయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. సొసైటీపై ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టబద్ధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

1,142 కిలోల గంజాయి స్వాధీనం : రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్



పట్టుబడిన గంజాయి బస్తాలను చూపిస్తున్న డీఎస్పీ సాయి ప్రశాంత్

రంపచోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి తరలిస్తున్న 1,142 కిలోల గంజాయిని రంపచోడవరం పోలీసులు పట్టుకోగా ఈ కేసులో నలుగురిని మంగళవారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఉత్తర్వులపై ఇతర జిల్లాలకు గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం రావడంతో జూన్ 27న మండలంలోని తాళ్లపాలెం వెళ్లే రోడ్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా బొలెరోలో రవాణా చేస్తున్న 1,142 కిలోల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. అప్పుడు నిందితులు పారిపోయినట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులు వదిలి వెళ్లిన వాహనాల ఆధారంగా పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో విచారణ చేసి అరెస్టు చేశామన్నారు. అరెస్ట్ అయినవారిలో అల్లూరి జిల్లా చింతపల్లి మండలం గ్రుంటువల్లికి చెందిన జెమ్మిలి రాజేష్, కొత్తవీధి మండలం పెట్రాయికి చెందిన కోడ శ్రీకాంత్, చింతపల్లి మండలం వీరవరం గ్రామానికి చెందిన వంతల కిరణ్, తెలంగాణ రాష్ట్ర వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చంద్రతండాకు చెందిన భుక్యా దేవేందర్ ఉన్నట్టు పేర్కొన్నారు. బొలేరో, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ మార్కెట్‌లో రూ.కోటి 10 లక్షలు ఉంటుందన్నారు. దాడుల్లో సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

రైలులో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత



తునిలో ప్రయాణికుడికి ల్యాప్‌టాప్‌ని అందజేస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి తుని వరకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (డీ-3 కోచ్) లో ప్రయాణించిన ఓ వ్యక్తి తన ల్యాప్‌టాప్‌ను రైలులో మర్చిపోయి దిగిపోయాడు. కాకినాడ జిల్లా తుని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీఆర్‌పీ ఎస్ఐ శ్రీనివాసరావు అదే రైలులో విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఎస్ఐ శ్రీనివాసరావు బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందజేశారు.

అరటి, కొబ్బరి తోటల నరికివేతపై దీక్ష

ప్రత్తిపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఇ.గోకవరం గ్రామంలో అరటి, కొబ్బరి తోటలను దౌర్జన్యంగా నరికివేతపై బాధిత రైతు రిలే నిరాహార దీక్ష చేపట్టాడు. తన పొలంలో ఏర్పాటు చేసుకున్న శిబిరంలో రైతు రాజమండ్రికి చెందిన సత్తి వినోద్ రెడ్డి, పలువురు రైతులు దీక్షలు చేపట్టారు. వినోద్‌రెడ్డి మాట్లాడుతూ తమ భూమికి క్రయ దస్తావేదులు, రికార్డులు ఉన్నప్పటికీ ఏ సంబంధం లేని చింతాకుల భాస్కరరావు, ధర్మాజీ, మరికొందరు ఈనెల 23న పొలంలో సాగు చేపట్టిన అరటి, కొబ్బరి మొక్కలను దారుణంగా నరికివేశారని వాపోయాడు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. ఈ భూ వివాదం కారణంగా తనకు ప్రాణహాని కూడా ఉందని... పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కాపాడాలని బాధితుడు కోరారు.



కాకినాడ జిల్లా ఇ.గోకవరంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతు

దళితులకు అత్యంత ద్రోహం చేసిన జగన్ : హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): దళిత వ్యతిరేక కార్యక్రమాలు చేసిన జగన్ ఇప్పుడు దళితులపై దాడులు జరగకుండా దళిత ఫోర్స్ ఏర్పాటు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. దేశ చరిత్రలో దళితులకు అత్యంత ద్రోహం చేసిన వ్యక్తి మాజీ సీఎం జగన్ అని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో దళితులను కులవివక్షతతో అణిచివేశారన్నారు. దళితులకు ఉప యోగపడే 25 సంక్షేమ పథకాలను రద్దుచేశాడని చెప్పారు. దళితుల గురించి మాట్లాడే అర్హత, హక్కు జగన్‌కు లేదన్నారు.. మమ్మల్ని మేము రక్షించుకోవడం, మా హక్కుల కోసం పోరాటం చేయడం మాకు తెలుసునని నిన్ను నమ్మే పరిస్థితి దళిత సమాజంలో లేదని అన్నారు.

పారదర్శకంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్

దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దు

విశాఖపట్నం ఆర్మీ అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 5నుంచి 20 వరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు విశాఖపట్నం ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఆర్మీలో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని పేర్కొన్నారు. ప్రధానంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు నియామకం జరుగుతుందన్నారు. 8 నుంచి 10 తరగతి పాస్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్‌టీఆర్, కాకినాడ జిల్లా, యానాం నుంచి ర్యాలీకి అడ్మిట్ కార్డులు పొందిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. గత మార్చి 12న ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం అన్ని ధ్రువపత్రాలు, ఫోన్‌లను తీసుకురావాలని.. దళారులు, ఏజెంట్లు, మధ్యవర్తుల్ని నమ్మవద్దని కోరారు.

అదృశ్యమైన ఇద్దరు బాలికలు..

సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత

సర్పవరం జంక్షన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఎస్.అచ్చుతాపురానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యం కాగా సాంకేతిక పరిజ్ఞానంతో వారిని సురక్షితంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. కాకినాడ 48వ డివిజన్ పరిధి ఎస్.అచ్చుతాపురానికి చెందిన తంగెళ్ల సూర్యనాగమ్మ-నరసయ్య కుమార్తె రామారావుపేటలోని సంజీవ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లిన ఆమె సాయంత్రం ఇంటికి రాకుండా అదే ప్రాంతానికి చెందిన 10వ తరగతి చదువుతున్న మరో బాలికతో కలిసి మిస్సింగ్ అయినట్టు సదరు బాలిక తండ్రి ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేశాడు. ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో బాలికల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఆధారంగా బాలికలు అమలాపురం వైపు వెళ్తున్నట్టు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన అమలాపురం పోలీసులు బాలికలను మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని వారి సమాచారాన్ని ఇంద్రపాలెం పోలీసులకు అందించారు. దీంతో ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి అమలాపురం వెళ్లి బాలికలను పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదుపై తక్షణం స్పందించి తమ కుమార్తెలను సురక్షితంగా అప్పగించేలా చర్యలు తీసుకున్న ఎస్పీ బిందుమాధవ్, ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు, సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు బాలికలతో ఎస్ఐ వీరబాబు

ఆర్టీసీ డ్రైవర్‌కు మూడు బంగారు పతకాలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా రవీంద్రపాడులో ఈ నెల 26, 27న జరిగిన రాష్ట్ర స్థాయి అమరావతి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావు 3 బంగారు పతకాలు సాధించారు. నవంబరులో భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు, జనవరిలో బెంగళూరులో జరిగే ఏషియన్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఆయన్ని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవివర్మ, కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు అభినందించారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఆర్టీసీ ఈడీ

అమలాపురం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.16లక్షలు

ఆత్రేయపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోముఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించుకున్నారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,16,428 వచ్చింది.

చినుకు పడితే చిత్తడే

- అధ్వానంగా సోంపల్లి శివాలయం రోడ్డు
- గొయ్యిల్లో పడి గాయపడుతున్న ప్రజలు

రాజోలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216 నుంచి సోంపల్లి శివాలయం మీదుగా కట్టా తాతయ్యగారి వారధి వరకు పంచాయతీరాజ్ శాఖకు చెందిన 800మీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈరోడ్డు బురదమయంగా మారింది. పలుచోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోతుల్లో వర్షం నీరు చేరడంతో రహదారిపై గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పెద్ద పెద్ద గోతులు పడ్డ ఈరోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. రాత్రి సమయంలో ఈరోడ్డులో ప్రయాణించే వాహనదారులు, స్థానికులు గొయ్యిల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈరోడ్డులో నిత్యం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అధ్వాన రోడ్డులో ప్రయాణం చేయలేకపోతున్నామని స్థానికులు, వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సోంపల్లి శివాలయం నుంచి కట్టా తాతయ్యగారి వారధి వరకు ఉన్న 800మీటర్ల అధ్వానంగా ఉన్న రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించాలని స్థానికులు, వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



చెరువులా మారిన సోంపల్లి శివాలయం రోడ్డు

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన

అంబాజీపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఇసుకపూడిలో రూ.1.25కోట్లతో నిర్మించనున్న నూతన రోడ్ల పనులను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణంపైఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే స్పందించి ఆ ఇబ్బందులను వెంటనే పరిష్కరించారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. 20ఏళ్లుగా అధ్వానంగా ఉన్న రోడ్డును గత పాలకులు పట్టించుకోలేదని ఎమ్మెల్యే గిడ్డి కృషితో రహదారిని నిర్మించడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఇసుకపూడి జడ్పీ హైస్కూల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచిచూశారు. తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని స్థాని కులు, హెచ్‌ఎం వరప్రసాద్ ఎమ్మెల్యేకు వివరించారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జేఈ సంపత్, సర్పంచ్ తరటపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, నాయకులు పళ్ల శ్రీనివాసరావు, ఫైపాల తాతాజీ, రవణం రాము, యనమదల సాయిబాబు పాల్గొన్నారు.



ఇసుకపూడిలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మా వైసీపీ నేతలే పట్టించుకోలేదు...

ఇసుకపూడి ప్రధాన రహదారి అభివృద్ధికి మా వైసీపీ నేతలే నిధులు మంజూరు చేయలేదని ఇసుకపూడి వైసీపీ ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాది కాలంలోనే గ్రామంలో రహదారి నిర్మాణానికి రూ.1.25కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయించారని ఎమ్మెల్యేను కొనియాడారు. మా వైసీపీ ప్రభుత్వంలోనే మేము రోడ్డును నిర్మించుకోలేకపోయాం అంటూ ఎంపీటీసీ ప్రశాంత్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గిడ్డి బలరాం రచించిన సీఎస్ఆర్ గ్రంథావిష్కరణ

యానాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సీఎస్ఆర్) అనే గ్రంథాన్ని యానాం పరంపేటకు చెందిన విశ్రాంతి పుదుచ్చేరి డిప్యూటీ డైరెక్టర్ కమ్ అండర్ సెక్రటరీ (ఎల్ఏడి) గిడ్డి బలరాం రచించారు. మంగళవారం మధ్యాహ్నం యానాంలో కళైమామణి అవార్డు గ్రహీత పొనుగుమట్ల విష్ణుమూర్తి ఆ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతు బలరాం సీఎస్ఆర్ గురించి వివరిస్తు పుస్తకం రాయడం గొప్ప విషయం అన్నారు. పుస్తక రచయిత బలరాం మాట్లాడుతు సీఎస్ఆర్ విధి, విధానాలు, ప్రజాసంక్షేమం వంటి అంశాలపై అందరికి అవగాహన కలిగించేలా పుస్తకం రాశానని చెప్పారు. కార్యక్రమంలో నామాడి అప్పారావు, వ్యవసాయశాఖ విశ్రాంత అడిషన్ డైరెక్టర్ హుస్సేన్, జాయింట్ డైరెక్టర్ కామిశెట్టి వేణుగోపాలరావు, పండు సిద్ధార్థకుమార్, తాళ్లరేవు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, గుత్తుల రామారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమానికి ప్రార్థన చేద్దాం

యూపీఎఫ్ జిల్లా ఆవిర్భావ దినోత్సవంలో అధ్యక్షుడు డేవిడ్ కొమానపల్లి

ఉప్పలగుప్తం, జూలై 29(ఆంధ్రజ్యోతి): అందరి సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలుకు మార్గం సుగమం అయ్యేలా దేవుని ప్రార్థించేందుకు అందరూ సిద్ధం కావాలని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ కార్ల్ డేవిడ్ కొమానపల్లి పిలుపు ఇచ్చారు.యూపీఎఫ్ ఆవిర్భావ వేడుకలు ఉప్పలగుప్తం ఇస్సాకు ఫౌండేషన్ ప్రార్థనాశక్తి ఎస్టేట్‌లో మంగళవారం యూపీఎఫ్ జిల్లా కార్యదర్శి పాస్టర్ యెహోషువ అధ్యక్షతన జరిగాయి. ఈకార్యక్రమంలో చిక్కం ఇస్సాకు వాక్య సందేశం అందించారు. కార్యక్రమంలో బిషప్ శామ్యూల్, జిల్లా ఉపాధ్యక్షుడు విక్టర్ నందా, ఎర్నెస్ తాతపూడి, యూవీ భాస్కరరావు, కోశాధికారి ఇమ్మానియేల్, సంయుక్త కార్యదర్శి అబ్రహాంపిన్ని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ బ్రదర్ సునీల్‌కుమార్, బ్రదర్ సంపత్, చిక్కం దానియేలు, జిల్లా వ్యాప్తంగా 300మంది దైవజనులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు

అమలాపురం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): బలవంతంగా బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజావేదిక ఆధ్వర్యంలో అమలాపురం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ నాయకుడు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల అదనపు భారం వేసిందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగులకొట్టండని చెప్పిన కూటమి నేతలు నమ్మక ద్రోహం చేశారని ధ్వజమెత్తారు.విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణ ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలో ఇదొక భాగమన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు విధానాన్ని తక్షణం నిలుపుదల చేయాలని, విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 5న జిల్లాలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పీతల రామచంద్రరావు, నిమ్మకాయల శ్రీనివాసరావు, కె.భాస్కరరావు, జి.రమణ, ఊటాల వెంకటేష్, పి.మురళీకృష్ణ, జి.సత్యం, కె.వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో సరికొత్త ప్రపంచం

- ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వైవీఎన్ కృష్ణమూర్తి



మలికిపురం కళాశాలలో మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణమూర్తి

మలికిపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): సాంకేతిక మరింత అభివృద్ధి చెందితే సరికొత్త ప్రపంచం ఆవిష్కృతమవుతుందని దానికి అనుగుణంగా విద్యార్థి దశ నుంచే టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వైవీఎన్ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అంతరిక్ష ప్రయోగాలు, రక్షణరంగం, ఔషధ పరిశ్రమ, ఆర్థికసేవలు, మెటీరియల్ సైన్స్ ఊహించని స్థాయిలో మారిపోతాయన్నారు. ఆప్టిమైజేషన్, క్రిప్టోగ్రఫీ, మెషీన్ లెర్నింగ్‌లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. క్వాంటమ్ టెక్నాలజీతో డేటా హ్యాకింగ్ చాన్స్ ఉండదన్నారు. పంటలపై చీడపడీల ప్రభావం నివారణపై అధ్యయనం సులభతరమవుతుందని, వాతావరణ మార్పులను ఖచ్చితంగా అంచనా వేసే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే వర్షాలు ఎప్పుడు కురుస్తాయి, విపత్తులు ఎప్పుడు వస్తాయో తెలుసుకుంటున్నామని అన్నారు. ఆధునిక, సాంకేతికతతో ఆస్తి, మనుషుల మరణాలు నివారించవచ్చునన్నారు. విద్యార్థులంతా నైపుణ్యాలను ఒడిసిపట్టుకుని ముందుకు వెళ్లాలన్నారు. జాతీయ క్వాంటమ్ మెషీన్ ఎన్‌క్యూఎం ఏర్పాటుచేసిన కేంద్ర ప్రభుత్వం రూ.6వేల కోట్లు కేటాయించిందన్నారు. 2023- 31 నాటికి క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి పరిశోధనల కోసం ఈ మొత్తాన్ని వెచ్చిస్తారన్నారు. సమావేశంలో మరో ముఖ్య అతిథి హెచ్‌ఆర్ ఉష మాట్లాడుతూ విద్యార్థులు సమూహాలుగా ఏర్పడి అభ్యసన చేయాలని సూచించారు. భావ వ్యక్తీకరణ నైపుణ్యాన్ని నేర్చుకోవలన్నా రు. సమావేశంలో కృష్ణమూర్తి దంపతులను సన్మానించారు. కరస్పాండెంట్ మంగెన సత్యనారయణ, ఆనంద్ మహానీ, గోపీనాథ్, చిట్టాల సత్యనారాయణ, పీడీకే ప్రసాద్, డాక్టర్ విజయ్‌సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ తయారీ కంపెనీకి రూ.50వేలు జరిమానా

అమలాపురం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీపణిత ఆధ్వర్యంలో మంగళవారం నడిపూడిలోని వరలక్ష్మి ఇండస్ట్రీస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గ్లాసులు తయారు చేస్తున్నట్టు గుర్తించి రూ.50వేలు జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ షాపులకు ఈ టెండర్

యానాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): యానాం మున్సిపాల్టీకి సంబంధించిన షాపులకు రానున్న రోజుల్లో ఈటెండర్ నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బుద్ది అఖిల్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యానాం మున్సిపల్ శాఖలో నెల రోజుల్లో తీసుకువచ్చిన విధి విధానాలను వివరించారు. యానాం మున్సిపాల్టీ అభివృద్ధితో పాటు ప్రజలకు అందించే సేవల విధి విధానాల్లో మార్పులు తీసుకువచ్చామన్నారు. జనన, మరణ నమోదులు, వ్యాపారులకు సంబంధించిన ట్రేడ్ లైసెన్సుల జారీ, మున్సిపాల్టీకి కట్టాల్సిన పన్నులు తదతర అంశాలపై వివరించారు. చెత్త సేకరణలో సంతృప్తిగా లేనని, డ్రైన్లు, రోడ్లు శుభ్రతలను స్వయంగా పర్యవేక్షిస్తున్నానన్నారు. ప్లాస్టిక్ రహిత యానాంగా తీర్చిదిద్దుతానని వివరించారు. సకాలంలో పన్నులు కట్టి మున్సిపల్ శాఖకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సమస్యలను ప్రజలు కార్యాలయానికి నేరుగా తనకు చెప్పవచ్చన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

అంబాజీపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): విజయానందం సేవా సంస్థ వ్యవస్థాపకుడు కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.50వేలు విలువైన పుస్తకాలు, పలకలు, పరీక్ష అట్టలను పుల్లేటికుర్రు నెహ్రూనగర్‌లో ఉన్న 143మంది విద్యార్థులకు మంగళవారం జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ బీర హనుమంతరావు, ఎంఈవో మోకా ప్రకాష్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు డీవీ నారాయణరావు, గుబ్బల శ్రీనివాసరావు, క్లస్టర్ జాయింట్ సెక్రటరీ కేవీఎస్ కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.వీరవేణి, ఉపాధ్యాయులు వి.వరలక్ష్మి, కె.భూలక్ష్మి, వై.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ములికిపల్లి పంచాయతీలో అవినీతిపై విచారణ జరపాలి

రాజోలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ములికిపల్లి గ్రామ పంచాయతీలో రూ.27లక్షల అవినీతి జరిగిందని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశామని గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు, ఎం.సీతామహాలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం గ్రామస్థులు నిరసన తెలిపారు. ములికిపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతిపై తక్షణం విచారణ జరపాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో శానిటేషన్ చేయకుండానే చేసినట్టు బిల్లులు పెట్టుకున్నారన్నారు. పంచాయతీ నిధులతో ఒక చోట రోడ్డు వేసినట్టు చూపించి వేరే ఊరులో రోడ్లు వేస్తున్నారని తెలిపారు. విష్ణుమూర్తి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించగా ములికిపల్లి గ్రామపంచాయతీలో రూ.27లక్షలు అవినీతి జరిగిందన్నారు. ఎం.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ములికిపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన రూ.27లక్షల అవినీతి సొమ్మును రికవరీచేసి గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు. ములికిపల్లి గ్రామ పంచాయతీలో అవినీతి జరిగినట్టు ఫిర్యాదు అందిందని, దీనిపై విచారణ జరిపి నివేదికను అధికారులకు అందజేస్తామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్



ములికిపల్లిలో గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కొత్త సిలబస్‌పై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆదినారాయణ

అమలాపురం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పాఠ్య పుస్తకాలు మారినందున కొత్త సిలబస్‌పై అధ్యాపకులతో పాటు విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇంటర్మీడియట్ విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ పేర్కొన్నారు. సిలబస్‌తో పాటు ప్రశ్నపత్రంలోను మార్పులు తీసుకురావడం జరిగిందని, వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధ్యాపకులకు సూచించారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ విద్యలో చేపట్టిన సంస్కరణలపై జిల్లాలోని ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రైవేటు మేనేజ్‌మెంట్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. అధ్యాపకులు కష్టపడి పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రిన్సిపాల్స్ కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు, ప్రిన్సిపాల్స్ వై.లక్ష్మణరావు, సాధనాల శాంతిరాజశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ సిలబస్ మారుతుందని, కొత్త సిలబస్‌తో విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధపడేలా నిపుణులు పాఠ్య పుస్తకాలు రూపొందిస్తున్నారని వివరించారు.

రెండు గ్రామాల ఉమ్మడి బూత్‌ను వేరు చేయండి

అంతర్వేది, జూలై 29(ఆంధ్రజ్యోతి): మోరి, మోరిపోడు గ్రామాలకు చెందిన ఉమ్మడి 34వ పోలింగ్ బూత్‌ను రెండుగా వేరు చేయాలని డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన వివిధ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో రాజోలు నియోజకవర్గ ఎన్నికల అధికారి డీఆర్డీఏ పీడీకి మోరి, మోరిపోడుకు చెందిన 34వ బూత్‌ను రెండు బూత్‌లుగా ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో పొలమూరి శ్రీనుబాబు, చాగంటి స్వామి, అడబాల విజయ్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కడలి నారాయణమూర్తి, కట్టా బుజ్జి, పొన్నమండ శేషు, కడలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం



అమలాపురం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పేరూరు గ్రామ పంచాయతీ పరిధిలో సచివాలయాల్లో పనిచేస్తోన్న వివిధ విభాగాల ఉద్యోగులకు ఇటీవల సాధారణ బదిలీలు నిర్వహించారు. బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దాసరి అరుణ ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఉద్యోగులు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు, చొల్లంగి సుబ్బరామ్, పాలకవర్గ సభ్యులు తిక్కా సరస్వతి, చొల్లంగి సుజాత, కురసాల వీరబాబు, దూలం బుజ్జి, దేగల వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, పర్తంశెట్టి శ్రీనివాసరావు, దాసరి డేవిడ్ తదితరులు పాల్గొని ఉద్యోగులకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

స్కూల్ బస్సు డ్రైవర్లను గమనిస్తూ ఉండాలి

జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు



అమలాపురం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సుల్లో పనిచేసే డ్రైవర్లను ఎప్పటికప్పుడు యాజమాన్యాలు పరిశీలిస్తూ ఉండాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు మంగళవారం ఆయన పలు సూచనలు చేశారు. స్కూలు బస్సుల డ్రైవర్లను నియమించే ముందు అతని బ్యాగ్ గ్రౌండ్ విధిగా పరిశీలించి డ్రైవింగ్ లైసెన్సు హిస్టరీ గురించి ఆర్టీవో కార్యాలయంలో సరి చూసుకోవాలన్నారు. విద్యార్థులతో బస్సులు నడిపేటప్పుడు డ్రైవర్లు సెల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ మోడ్‌లో ఉంచాలని, బస్సు అటెండెంట్ వద్దనున్న సెల్‌ఫోన్ మాత్రమే ఆన్‌లో ఉంచాలన్నారు. బస్సు డ్రైవర్ శారీరక, మానసికస్థితిని యాజమాన్యం ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. బస్సు సిట్టింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కిస్తే చట్టప్రకారం తీసుకునేచర్యలకు యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రహదారి భద్రత విషయంలో చిన్న తప్పిదాన్ని కూడా ఉపేక్షించేది లేదని, మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లారవాణాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు.

తెలుగు సాహిత్యంలో నారాయణరెడ్డిది ప్రత్యేక శైలి

అమలాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీ రంగంలో డాక్టర్ సి.నారాయణరెడ్డిది ప్రత్యేక శైలి అని శ్రీశ్రీకళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి పేర్కొన్నారు. ఈదరపల్లి రవితేజ జూనియర్ కళాశాలలో మంగళవారం శ్రీశ్రీకళావేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో సినారె జయంతి సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.దొరబాబు అధ్యక్షతన జరిగిన సభలో సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోనసీమ రచయిత సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీవీ సత్యనారాయణ, కె.ప్రసాద్, ఎస్.రమేష్, కె.భాగ్య, జి.సౌమ్య, పి.ప్రియభారతి, కె.సూర్యకుమారి, తేజస్విని, డి.గీత, కె.వర్మ తదితరులు మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో సినారె రచనలను వివరించారు.

దళిత చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా బుజ్జి

రాజోలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): దళిత చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా పొదలాడకు చెందిన లిఖితపూడి బుజ్జి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజోలులో దళిత చైతన్యవేదిక విస్తృత కార్యవర్గ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్ అధ్యక్షతన మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కోఆర్డినేటర్‌గా చింతా శ్రీనివాస్, రాజోలు మండలాధ్యక్షుడిగా మందపాటి మధును సభ్యుల సమక్షంలో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ ప్రకటించారు. దళిత చైతన్యవేదిక నాయకులు కండువా కప్పి నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని త్వరలో నియమిస్తామని తెలిపారు. దళిత చైతన్యవేదిక నిర్వహిస్తున్న పే బ్యాక్ టూ ద సొసైటీ కార్యక్రమాలకు సహకరిస్తున్న వైస్ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబును దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. నూతన కార్యవర్గానికి సరెళ్ల సురేష్‌బాబు, జిల్లెల్ల వినోద్, బొడ్డపల్లి పుల్లయ్య, దీపాటి శివప్రసాద్, కాకర విశ్వనాథం, తెన్నేటి నాగేశ్వరరావు, నీతిపూడి సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ముమ్మిడివరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, అనధికార స్థలాలు కొనుగోలు చేసిన వారికి వాటి క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కమిషనర్ పి.రవివర్మ మంగళవారం తెలిపారు. జూలై 26 నుంచి 90రోజుల్లో ముమ్మిడివరం నగర పంచాయతీలో ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలెప్మెంట్‌వారు జీవో 134ను అనుసరించి అనధికారలేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారన్నారు. జూన్ 30కిముందు ఎవరైనా అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేస్తే వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు పీనలైజేషన్ చార్జీలు, స్థలాలకు 14శాతం మార్కెట్ వాల్యూ ప్రకారం చార్జీలు చెల్లించిన స్థలాన్ని క్రమబద్ధీకరణ చేయడానికి అవకాశం ఉందన్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ముమ్మిడివరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శక్తి యాప్‌పై అవగాహన

మలికిపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నేడు సమాజంలో జరుగుతున్న అనేకమైన దారుణాలకు డ్రగ్స్ కారణమని ఎస్ఐ పి.సురేష్‌కుమార్ అన్నారు. భాష్యం పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన, శక్తి యాప్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఐ మాట్లాడారు. ఆడపిల్లల పట్ల ఎవరైనా లైంగిక దాడులకు పాల్పడినా, ప్రేరేపించినా, అసభ్య పదజాలం వాడుతున్నట్టు గమనిస్తే తమదృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాస్, ప్రియసుధ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

యానాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రతిరేషన్‌కార్డు సభ్యుడు ఈకేవైసీ చేయించుకోవాలని పరిపాలనాధికారి మునిస్వామి కోరారు. రేషన్ కార్డులోని ప్రతీ లబ్ధిదారుడు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. యానాంలోని ఉన్న ఐదు కామన్ సర్వీస్ సెంటర్ల(సీఎస్‌సీ)లో ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

రోళ్లపాలెంలో 'సుపరిపాలన'



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రోళ్లపాలెంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడుతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మట్ట మహలక్ష్మి ప్రభాకరరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, నాయకులు రాజులపూడి భీముడు, మంద గెద్దయ్య, మాడామాధవి, దున్నాల దుర్గ, మట్ట నాగేశ్వరరావు, తిరుమనాథం మురళీ, మట్ట సాయిరామారావు, మొయిల శ్రీను, నూటుకుర్తి ప్రసాద్, యనమదల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దిండిలో 'తొలి అడుగు'

మలికిపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): కూటమితోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ అమలాపురం పార్లమెంటు అధికార ప్రతినిధి బందెల పద్మ అన్నారు. మంగళవారం దిండిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ కార్యక్రమాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

అంబాజీపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు మాడా సత్య సూర్యకుమారి, పెదశింగు సూర్యచంద్రరావులను హెచ్‌ఎం అక్కిరాజు శేషశాయి ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందరావు, ఉపాధ్యాయులు శశికుమార్, రాజశేఖర్, సీతారాం, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడు ముత్యాలకు సన్మానం

అల్లవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడిగా బోడసకుర్రు గ్రామానికి చెందిన ముత్యాల బాబిని నియమించారు. బోడసకుర్రులో ముత్యాల బాబిని ఆయన స్వగృహం వద్ద అల్లవరం సహకార సొసైటీ చైర్‌పర్సన్ కంకిపాటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జనసేన నాయకులు పోలిశెట్టి బాబులు, రొక్కాల నాగేశ్వరరావు, రేళ్ల శ్రీనివాస్, పిల్లా ప్రసాద్, యాళ్ల బిందాస్, జల్లి స్వామి తదితరులు బాబిని అభినందించారు.

కమ్యూనిస్టు విప్లవ యోధుడు నాగయ్యకు నివాళి



మచ్చా నాగయ్య (ఫైల్)

అమలాపురం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన మచ్చా నాగయ్య మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అయినవిల్లిలంకలో జన్మించిన నాగయ్య పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీలో సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడిగా పనిచేసి బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారు. మంగళవారం తెల్లవారుజామున అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నాగయ్య మృతిచెందారు. ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, పౌరహక్కుల సంఘం జిల్లాశాఖ అధ్యక్ష కార్యదర్శులు జిల్లెల్ల మనోహర్, అమలదాసు బాబూరావు, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు యేడిద రాజేష్, ఎ.రవి, ఏపీ రైతుకూలీసంఘం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కొండా దుర్గారావు, సరెళ్ల దాసు, దీపాటి శివప్రసాద్, కొంకి రాజామణి, బొంతు రమణ, కారెం వెంకటేశ్వరరావు తదితరులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దు: డీఎస్పీ



విద్యార్థులతో ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దని ప్లకార్డులతో డీఎస్పీ, సీఐ

అంబాజీపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో యువతి, యువకులు సెల్‌ఫోన్ల వాడకం ఎక్కువగా ఉందని, కొంతమంది సైబర్ నేరగాళ్ల వలలో పడి సొమ్ములు పోగొట్టుకోవడంతో పాటు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని కొత్త పేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. అంబాజీపేట ఎస్ఎస్ఎం కళాశాలలో మంగళవారం పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు అధ్యక్షతన శక్తియాప్‌పై నిర్వహించిన అవగాహనసదస్సులో ఆయన మాట్లాడారు. ఫోన్లకు అనధికార లింకులు, వెబ్‌సైట్లు, మోసపూరిత కాల్స్ వచ్చినా, ఓటీపీలు చెప్పాలని అడిగినా స్పందించవద్దన్నారు. ఎస్ఐ కె.చిరంజీవి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి, కరస్పాండెంట్ మట్టపర్తి సాయిప్రసాద్, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ

అంతర్వేది, జూలై29(ఆంధ్రజ్యోతి): మోరి సుబ్బమ్మ మిషన్ ఆసుపత్రిలో మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాహార కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. డాక్టర్ లతాపాల్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గర్భిణులకు పోషకాహారంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అవసరమన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రోటరీక్లబ్ మలికిపురం అధ్యక్షుడు గెద్దం ఫిలిప్‌రాజు రోటరీక్లబ్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. డాక్టర్ బందెల సంపత్‌కుమార్, సభ్యులు గెద్దం పేర్రాజు, అల్లూరి మధురవిరామరాజు, నల్లి శివకుమార్, సందెపూడి ఆదామ్, రాపాక విజయరావు, ఎన్నార్ రాజశేఖర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే వేగుళ్ల


వేములపల్లిలో పామాయిల్ మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే వేగుళ్లతో పాటు పతంజలి సంస్థ ప్రతినిధులు

మండపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతులకు ఆదాయాన్ని చేకూర్చే పామాయిల్ సాగును మెట్ట రైతులు చేపట్టాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లిలో జిల్లా ఉద్యానవనశాఖ, పతంజలి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ మెట్టప్రాంత రైతులు పామాయిల్ సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలన్నారు. రూ.193 విలువ చేసే పామాయిల్ మొక్కలను దొంతమూరుకు చెందిన పతంజలి సంస్థ ఉచితంగా ఇవ్వటం హర్షణీయమన్నారు. పతంజలి సంస్థ డీజీఎం మాట్లాడుతూ భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పామాయిల్ సాగు చేయాలని రైతులకు సూచించారు. రూ.193 విలువైన పామాయిల్ మొక్కను ఉచితంగా పతంజలి సంస్థ ఇస్తుందని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనూష తెలిపారు. జిల్లాలో 1,500 ఎకరాల్లో పామాయిల్ సాగవుతుందన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను ఆమె రైతులకు తెలిపారు. కార్యక్రమంలో తొలుత పామాయిల్ మొక్కను నాటారు. సబ్సిడీపై అందించే వ్యవసాయ పరికరాల స్టాల్‌ను సందర్శించారు. ఆయన వెంట స్థానిక నేతలు నల్లమిల్లి వీర్రెడ్డి, గోణం పుల్లయ్య, మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి జీవీవీ ప్రసాద్, బీజేపీ నాయకుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా కొనసాగుతున్న వరద ప్రవాహం

ఆలమూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ప్రవాహం మండలంలోని ఆయా లంక గ్రామాల్లో నిలకడగా కొనసాగుతోంది. రెండు రోజులుగా గోదావరి వరద కొంచెం తగ్గుతూ మరికొంత పెరుగుతూ వస్తోంది. దీంతో మండలంలోని ఆయా లంక భూముల్లోకి వరద నీరు చేరగా, పల్లపు ప్రాంతాల్లో ఉన్న పంటలకు నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం ఉన్న గోదావరి వరద వల్ల పలు గ్రామాల్లో సాగు జరుగుతున్న వాణిజ్య పంటలకు ఇబ్బంది లేదని, గోదావరి వరద మరింత పెరిగితే నష్టం అధికం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జొన్నాడ వద్ద రెండు వంతెనల మధ్య గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. పుష్కర్ ఘాట్ వద్ద ఉన్న ఆలయాల వద్దకు వరదనీరు చేరడంతో పలువురు ఆసక్తిగా చూస్తున్నారు.


జొన్నాడ పుష్కర్‌ఘాట్ వద్ద వరద

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై అధికారుల బృందం తనిఖీ


అక్రమంగా గ్రావెల్ తవ్వకం జరిపిన క్వారీల్లో తనిఖీలు చేస్తున్న రీజనల్ విజిలెన్స్ అధికారుల బృందం

మండపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల వేములపల్లి సర్వే నెం.328-2లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా సాగిన గ్రావెల్ తవ్వకాలపై స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు రీజనల్ విజిలెన్స్ ఏలూరు సెక్టార్ ఇన్‌చార్జీ టీ.కిషోర్ నేతృత్వంలో మంగళవారం వేములపల్లిలో గ్రావెల్ తవ్వకాలు జరిగిన క్వారీలో విజిలెన్స్, మైనింగ్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. వీరి తనిఖీల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగాయని సర్వేలో గుర్తించారు. సర్వేలో ఎంతమేర గ్రావెల్ తవ్వకాలు జరిగాయనే దానిపై తమ సర్వేలో వెల్లడైన తర్వాత భూ యజమానికి నోటీసులు జారీచేసి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. డీజీపీఎస్ సర్వే ద్వారా నిర్వహించిన సర్వే ద్వారా జరిగిన అక్రమాలు వెలుగు చూశాయన్నారు. తమ సర్వేలో వెల్లడైన విషయాలను ప్రభుత్వానికి నివేదించటంతోపాటు భూ యజమానికి గ్రావెల్ అక్రమ తవ్వకంపై అపరాధ రుసుం విధిస్తామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో రీజనల్ ఇన్‌స్పెక్టర్ కేవీ రమణ, కోనసీమ జిల్లా మైనింగ్ కార్యాలయ సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కపిలేశ్వరపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్య, ఆరోగ్య సిబ్బంది తల్లిదండ్రులకు సూచించారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని కాలేరు, వడ్లమూరు, నల్లూరు, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంగళవారం వైద్యాధికారుల పర్యవేక్షణలో ఆర్‌బీఎస్‌కె (రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం) లో వారి ఆరోగ్యస్థితిని పరీక్షించి పలు సూచనలు చేశారు. పోషకాహార లోపం లేకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ గోపాలకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నేలటూరులో చిన్నారులకు పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రుణాల సద్వినియోగంతో మహిళలు సాధికారత సాధించాలి

ద్రాక్షారామ, జూలై 29(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళలు సాధికారత సాధించాలని మంత్రి సుభాష్ కోరారు. మంగళవారం రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన స్వయంశక్తి సంఘాల మహిళకు, వీవోఏలకు ముద్ర యోజన రుణకల్పనపై అవగాహన సదస్సులో మంత్రి ప్రసంగించారు. డీఆర్‌డీఏ పీడీ జె.చంద్రగాంధీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లీడ్ బ్యాంకు మేనేజరు కేశవ వర్మ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ యూనిట్లు నెలకొల్పేందుకు రుణాల కల్పన జరుగుతుందని తెలిపారు. తోట బేబీ అనే మహిళకు మంజూరైన రూ.7 లక్షలు రుణం చెక్కును మంత్రి అందచేశారు. సమావేశంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, ఎంపీడీవో పద్మజ్యోతి, ఇతర శాఖల అధికారులు, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలకు చెందిన ఏపీఎంలు, వీవోఏలు, మహిళ సంఘాల సభ్యులు ఏపీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

పీఎంశ్రీలో బెస్ట్ స్కూల్‌గా ఎంపికవడం అభినందనీయం

రాయవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పీఎంశ్రీ పథకంలో రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికవడం అభినందనీయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం జాతీయ విద్యా విధానం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎంశ్రీ పాఠశాలలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జాతికి అంకిత మిచ్చారు. రాయవరం హైస్కూల్‌లో శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం విపర్తి శాంతి సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం డీఈవో షేక్ సలీం బాషా మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. బెస్ట్ పాఠశాలగా ఎంపికైన నేపథ్యంలో ఎంఈవోలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పీఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రాయవరం హైస్కూల్‌లో పీఎంశ్రీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వాడపల్లి ఆదాయం రూ.4.16 లక్షలు

ఆత్రేయపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,16,428 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ఆత్రేయపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూనంపూడి రామకృష్ణంరాజు పేర్కొన్నారు. మంగళవారం తాడిపూడి, పులిదిండి, మెర్లపాలెం తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లారు. కార్యక్రమంలో మెర్ల రాము, లక్ష్మీపతి, మల్లవరపు నాగరాజు, కనుమూరి తిరుపతి రాజు, తోట రజని తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెంలో పంట పొలాల్లో కురుస్తున్న వర్షం

కుండపోత వర్షం

రావులపాలెం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. నాలుగు రోజుల నుంచి ఎండలు కాస్తుండటంతో పంటపొలాలు మూన తిరిగే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు కలవరపాటుకు లోనయ్యారు. ఇలాంటి తరుణంలో వర్షం కురవడంతో పంటపొలాలకు మేలు చేకూరుతుందని రైతులంటున్నారు.

గరుత్మంతుడికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): అంగరలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం గరుత్మంతుడికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పలువురు వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరుత్మంతుడికి వేద మంత్రోచ్చారణ మధ్య అభిషేకం జరిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


తాతపూడిలో విద్యాబోధనను పరిశీలిస్తున్న ఎంఈవో తాతారావు

విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కపిలేశ్వరపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యాబోధన పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో కె.తాతారావు అన్నారు. మంగళవారం మండలంలోని తాతపూడి ప్రాథమిక పాఠశాల(మెయిన్) ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల విద్యాబోధన, పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, పాఠశాల పరిస్థితులు తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, సక్రమంగా జరగాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ నాయకుల ఆరోపణల్లో నిజం లేదు'

ఆలమూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ఓర్వలేక చింతలూరు వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వారి ఆరోపణల్లో నిజం లేదని చింతలూరు నూకాంబిక ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబుతోపాటు కూటమి నాయకులు గన్ని వెంకట్రావు, వీరి అప్పారావు తదితరులు అన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తల్లికి వందం 366 మందికి ఇచ్చారని, 34 మందికి పలు సాంకేతిక కారణాలతో నిలిచిపోయిందని త్వరలో వారికి అందిస్తామని తెలిపారు. నూకాంబిక అమ్మవారికి 45 కిలోల వెండి సేకరించి ఆభరణాలు చేయించామన్నారు. రూ.కోటి పైబడి విరాళాలు సేకరించి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి నాయకులకు దక్కిందని వారు తెలిపారు.

స్పీడ్ బ్రేకర్ల పనుల టెండర్లకు బ్రేక్

రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో 28 వార్డుల్లో స్పీడ్ బ్రేకర్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ఆమోదానికి కౌన్సిల్ బ్రేక్ వేసింది. మంగళవారం రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అజెండాలో 12, 13వ అంశంగా పేర్కొన్న వార్డుల్లో స్పీడ్ బ్రేకర్ల నిర్మాణానికి ఒక్కో స్పీడ్ బ్రేకర్ చదరపు మీటరు నిర్మాణానికి రూ.5,300 చొప్పున ప్రతిపాదిస్తూ చేసిన ప్రతిపాదనపై సమావేశంలో కౌన్సిలరు వాడ్రేవు సాయిప్రసాద్, అంకం శ్రీను మాట్లాడుతూ చదరపు మీటరుకు రూ.3వేలు అదనంగా వేశారని అంత ఖర్చు జరగదని తెలిపారు. దీంతో సదరు అంశాలను తిరస్కరిస్తూ రీటెండరు పిలవాలని తీర్మానించారు. 14వ అంశం మేజర్ డ్రైన్లలో సిల్ట్‌తీసి వెల్ల వాటర్ వర్క్సుకు తరలించడానికి, 15వ అంశం త్యాగరాజునగర్‌లో మేజర్ శ్లాబ్‌కవర్ల నిర్మాణాలకు ప్రతిపాదించిన టెండర్లను తిరస్కరిస్తూ రీటెండర్లు పిలవాలని తీర్మానించారు. నిరభ్యంతరకర ధృవీకరణ పత్రం లేనందున తిరస్కరించాలని వైస్ చైర్‌పర్సన్ కొలమూరి శివాజీ, కౌన్సిలర్ సాయిప్రసాద్ కోరారు. జీరో అవర్‌లో మున్సిపల్ డీఈ శ్రీకాంత్ తీరుపై జనసేన కౌన్సిలరు అంకం శ్రీను, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఈ శ్రీకాంత్‌పై పలు ఆరోపణలు చేశారు. దీంతో డీఈ, కౌన్సిలరు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సమావేశంలో వైస్ చైర్మన్ చింతపల్లి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

శ్రావణ మంగళగౌరిగా రావులమ్మ అమ్మవారు

ఆలమూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మంగళవారం సందర్భంగా ఆలమూరులోని రావులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి మంగళగౌరిగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని ఆయా ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై, 29(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా ఏర్పడిన త్రిసభ్య కమిటీ సభ్యులు రైతులకు ఉత్తమ సేవలను అందించాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల కోరారు. జెడ్.మేడపాడు సహకార సంఘం త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. దీనికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. త్వరలో నియోజకవర్గంలోని 22 సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులకు సమావేశం నిర్వహిస్తామన్నారు. జెడ్. మేడపాడు సహకార సంఘం అధ్యక్షుడిగా నియమితుడైన సలాది బాలసుబ్రహ్మణ్యం, సభ్యులు సంగిశెట్టి అమ్మన్న, బోయిడి వెంకటరమణలను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు కూటమినేతలు సుబ్రహ్మణ్యంను సత్కరించారు. కార్యక్రమంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సీహెచ్ రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ తదితరులతో పాటు, కూటమి నాయకులు, సంఘ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


జెడ్.మేడపాడు సహకార సంఘ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

జాబ్‌మేళాలో 92 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మోడరన్ విద్యా సంస్థల్లో మంగళవారం వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 92 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్‌మేళాలో పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఉపాధి కార్యాలయం ద్వారా ప్రతీవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 229 మంది హాజరు కాగా 92 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, వికాస ప్రతినిధులు, మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు పాల్గొన్నారు.

డ్రైనేజీ అభివృద్ధికి నిధులు మంజూరు

ఆత్రేయపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతుల పొలాలను ముంపుబారి నుంచి కాపాడేందుకు రూ.3కోట్లతో సైఫాన్ నిర్మాణాలు పూర్తిచేశారు. దశాబ్దాల రైతుల కలను కూటమి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సాకారం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో సైఫాన్ నిర్మాణం సరే.. ముంపునీరు ముందుకు వెళ్లే దారేది శీర్షికన కథనం వెలువడింది. దీనిపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టిసారించారు. పలివెల డ్రైనేజీ పూడికతీయించేందుకు రూ.14 లక్షలు మంజూరు చేయించినట్లు సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు తెలిపారు. డ్రైనేజీ పూడిక పనులు చేపట్టి ముంపు నీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

వినియోగదారులకు చెప్పకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు

మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు నిలదీత

రావులపాలెం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండల పరిషత్ మీటింగ్ హాలులో ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖల వారీగా వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే విషయంలో వినియోగదారులకు సమాచారం అందించడం లేదా వారికి తెలపడం చేయ కుండా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయడం ఏమి టని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు అందచేస్తామన్నారు. అప్పట్లో కొందరికి అందజేయగా, మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు ఎప్పుడు అందిస్తారో తెలపాలన్నారు. వీటిపై అధికారులు వివరణ ఇచ్చారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో మహేష్, తహశీల్దారు ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 31 మంది పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.29.61 లక్షలు చెక్కులు మంత్రి సుభాష్ మంగళవారం అందచేశారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు వాటిని అందచేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): కె.గంగవరం గ్రామానికి చెందిన గుబ్బల శ్రీనివాస్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం కోసం చాలా ఖర్చు చేయడంతో ఆర్థికంగా చితికిపోయాడు. ఈ విషయాన్ని స్థానిక కూటమి నాయకులు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు తెలియజేసి ఆదుకోవాలని కోరారు. దీంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1,13,793 మంజూరు చేయించారు. మంగళవారం శ్రీనివాస్ భార్య నాగరత్నానికి మంత్రి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గంగవరం సొసైటీ అధ్యక్షుడు నేమాని సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు సి.రాజ్ కుమార్, రవ్వా భూషణం తదితరులు పాల్గొన్నారు.


కె.గంగవరంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మంత్రి సుభాష్

నానో ఎరువులతో బహుళ ప్రయోజనాలు

కె.గంగవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతులు పెట్టుబడులు తగ్గించుకునే క్రమంలో నానో ఎరువులను ఉపయోగించు కోవాలని వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ బి.నాగకుమార్ అన్నారు. మంగళవారం బాలాంత్రం, పేకేరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. వీటికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఏవో ఏ.సద్గురుమూర్తి మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలాంత్రం సర్పంచ్ చాగంటి సాంబశివరావు, టీడీపీ నాయకుడు చలగళ్ల నాగేశ్వరరావు, మల్లిపూడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఆత్రేయపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఖాతాదారులకు సంస్థ విస్తృత సేవలు అందిస్తున్నట్లు డిప్యూటీ మేనేజర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాదారుడు కత్తుల రాజశేఖర్ మృతి చెందాడు. దీంతో ఆయన భార్య మౌనికకు రూ.2లక్షల బీమా యోజన చెక్కును మంగళవారం ఆయన అందజేశారు.

పాన్ షాపుల్లో విస్తృత తనిఖీలు

ఆలమూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పాన్ షాపుల్లో నిషేధించిన గుట్కాలు, పాన్‌పరాగ్‌ల విక్రయాలు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో ఆలమూరు మండలం చొప్పెల్లలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ అధ్వర్యంలో ఆయా పాన్‌షాపులపై తనిఖీలు జరిపారు. చొప్పెల్లలోని పలు పాన్ షాపులపై ఆయన సిబ్బందితో కలసి దాడి చేయగా నిషేధించిన ప్యాకెట్లు లభ్యం కావడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. పాన్‌షాపులు నిర్వహిస్తున్న వారు నిషేధించిన ప్యాకెట్ల విక్రయాలు చేయడం నేరమన్నారు. వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీకర్

కొత్తపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ కోరారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ నాయకుల ప్రతినిధులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో పి.శ్రీకర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన అంశాలు, ఓటర్ల జాబితా, వివరాలు తెలియచేసి వారి నుంచి సూచలను, సలహాలు తీసుకున్నారు. సమావేశంలో నాలుగు మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మోసపోయిన బాధితులకు మంత్రి ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ మంగళవారం ఆర్థికసాయం అందచేశారు. ఇటీవల అమలాపురంలో మహేష్ అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి దగ్గర లక్షల్లో సొమ్ములు వసూలు చేసి మోసగించిన సంగతి తెలిసిందే. మోసపోయిన బాధితులు దళిత నాయకులు కాటే సుబ్రహ్మణ్యం, రవ్వా భూషణం ఆధ్వర్యంలో మంత్రిని కలిసి తమగోడు విన్నవించుకున్నారు. దీనిపై మంత్రి స్పందించి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఇద్దరు మహిళలకు రూ.50 వేలు ఆర్థికసాయం అందచేశారు. ఉద్యోగాల పేరుతో మోసగించిన వ్యక్తిని కఠినంగా శిక్షించడంతో పాటు, సొమ్ములు రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు.

వైసీపీ నేతలు నిరాధార ఆరోపణలు విడనాడాలి

ఆత్రేయపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అసత్య ఆరోపణలు మానుకోవాలని టీడీపీ నేతలు హితవు పలికారు. మంగళవారం ఆత్రేయపురంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ముదునూరి వెంకట్రాజు, స్వగృహంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూనంపూడి రామకృష్ణంరాజు, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఎం.వెంకట్రాజు, తెలుగు యువత మండల అధ్యక్షుడు వెత్సా అనిల్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సోమవారం పేరవరంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కూటమి ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేయడంపై నాయకులు మండిపడ్డారు. భూకబ్జాలు, ల్యాండ్ మాఫియా మీ హయాంలో జరిగాయన్నారు. సమావేశంలో తోట రజని, జి.నాగేంద్ర, డి.త్రినాథ్, ఎం.ఫణీంద్రవర్మ, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.